PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆


# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 220 | మార్చి 2024 | 4 పేజీలు వెల : 2.00

Vol No | March 2024 | Rs




## సిఎఎను వ్యతిరేకిద్దాం

ప్రత్యేక సంచిక

# సిఎఎ మాకొద్దు!

• తక్షణమే వెనక్కి తీసుకోవాలి • లేకుంటే ప్రతిఘటన తప్పదు




**న**రేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలుకోసం నిబంధనలు ప్రకటించడంపై విద్యార్థులు, యువజనులు, మహిళలు, ప్రగతిశీలవాదులు, వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాజ్యాంగ విరుద్ధం, దేశ సమైక్యతకు ప్రమాదకరమూ, ముస్లిం మైనారిటీలను వేధించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ సిఎఎ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. 2019లో ఆమోదించిన సిఎఎను ప్రజాందోళన వల్ల అయిదేళ్ళు మూలన పెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు..కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనగా దాన్ని అమలు పరిచేందుకు నిబంధనల నోటిఫికేషన్ ప్రకటించడం స్పష్టంగా ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు బిజెపి ఆడుతున్న ప్రమాదకరమైన నాటకంలో భాగమే. ఈ చట్టం వల్ల దేశంలో ఉద్రిక్తతలు ఏర్పడతాయి. మనలాంటి రాష్ట్రంలో అశాంతి నెలకొంటుంది.

### ఏమిటీ చట్టం..!

**19**55 పౌరసత్వ చట్టానికి కొన్ని సవరణలు చేసి ఈ పౌరసత్వ సవరణ చట్టం (2019) తీసుకువచ్చారు. కొత్త చట్టం ప్రకారం పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌ల్లో మతపరమైన అణచివేతవల్ల 2014కు ముందు వలస వచ్చిన ప్రజల్లో ముస్లింలకు మినహా మిగిలిన మతాల ప్రజలకు అంటే హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులకు భారతీయ పౌరసత్వాన్ని ఇస్తారు. ముస్లిం ప్రజలకు మాత్రం పౌరసత్వం ఇవ్వరు. గతంలో భారత పౌరసత్వం ఇవ్వడానికి 11 సంవత్సరాలు దేశంలో నివసించాలన్న నిబంధన ఉండేది. దాన్ని కొత్త చట్టంలో అయిదేళ్లకు కుదించారు. దేశాన్ని ముక్కలు చేసే ప్రమాదమున్న పౌరసత్వ చట్టాన్ని సమర్థించుకోడానికి ప్రభుత్వం అనేక కుంటి సాకులు చెబుతున్నది. పొరుగు దేశాల్లో మతపరమైన హింసకు గురవుతున్న ప్రజలను 'మానవతా దృష్టితో' ఆదుకునేందుకే ఈ చట్టం తెచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. మానవతా దృష్టితోనే ప్రభుత్వం ఈ చట్టం తెచ్చినట్టయితే కేవలం మూడు దేశాలకే ఎందుకు పరిమితం చేయాల్సి వచ్చింది? మన పొరుగున ఉన్న మయన్మార్‌లో మైనార్టీలైన రొహింగ్యా ముస్లింలు, హిందువులు శ్రీలంకలో క్రైస్తవ తమిళులు తీవ్రమైన హింసాకాండకు గురయ్యారు. వారిని ఎందుకు ఈ చట్టంలో చేర్చలేదు అంటే ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. చివరికి పాకిస్తాన్ ముస్లింలలో అనేక మైనార్టీ తెగలు, ఉదాహరణకు అహ్మదీ తెగ వారు తీవ్రమైన హింసాకాండకు గురవుతున్నారు. మరి బిజెపి ప్రభుత్వ 'మానవతా' జాబితాలో వారు ఎందుకు చేరలేదు? వీటన్నిటి బట్టి చూస్తే దీని వెనుక 'మానవత' లేదనీ, ఒక రాజకీయ వ్యూహంతో ఇదంతా చేస్తున్నదనీ అర్థమవుతోంది.

**నష్టం ఇలా...!**

కేంద్ర ప్రభుత్వం 2019లో చేసిన పౌరసత్వ సవరణ చట్టం దేశంలోని ప్రజలను మతాలవారీగా విడగొడుతుంది. కుల, మత, ప్రాంతీయ, భాషా భేదాలకు అతీతంగా దేశ పౌరులందరూ చట్టం ముందు సమానమేనని చెబుతున్న భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ చట్టం దేశంలోని ముస్లిం ప్రజానీకం పట్ల తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తుంది. దీనితోబాటు అస్సాంలో జారీ చేసిన జాతీయ పౌరసత్వ రిజిస్టరు (ఎన్ఆర్‌సి)ని దేశమంతటికీ విస్తరించడానికి చేస్తున్న ప్రయత్నాలు భారతదేశ లౌకిక స్వభావాన్ని నాశనం చేసి, దాన్ని నిరంకుశ హిందూమత రాజ్యంగా మార్చడానికి ఆర్ఎస్ఎస్ ఎప్పటినుండో చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే. దీని వల్ల దేశంలోని ముస్లిం ప్రజలకే కాకుండా హిందువులు, ఇతర ప్రజానీకానికి కూడా నష్టం జరుగుతుంది. ఎందుకంటే దేశంలోని 140 కోట్ల జనాభా అంతా తాము భారత పౌరులమేనని నిరూపించుకోవాలి. సరైన పత్రాలు లేనివారంతా విదేశీయులు గా ముద్రపడి శరణార్థి శిబిరాల్లో బ్రతకాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ చట్టంపట్ల దేశవ్యాపితం గా ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవు తోంది.

### తిప్పికొట్టాల్సిందే...!

ఈ దశలోనే సిఎఎను తిప్పికొట్టకపోతే అమిత్ షా చెప్పినట్లు రేపు దేశమంతటా ఎన్ఆర్‌సి అమలుకు నిరాఘాటంగా పూనుకుంటారు. అప్పుడు భారతీయులమైన మనం భారతీయులమేనని నిరూపించుకోడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో నిలుచుని పత్రాలు సమర్పించాల్సి వస్తుంది. పత్రాలు లేకపోతే మనమంతా స్వదేశంలో అక్రమ వలసదారులం అవుతాం. కాబట్టి మతాలకతీతంగా ప్రజలంతా ఏకమవ్వాలి. పౌరసత్వ చట్టం అమలును తిప్పికొట్టాలి.

అస్సాంతో సహా ఈశాన్య రాష్ట్రాల్లోని మూల వాసులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

**నోరు విప్పని వైసిపి, టిడిపి,జనసేన**

సిపిఎం, కాంగ్రెస్ ఇతర ప్రతిపక్షాలు బిజెపి ప్రభుత్వ దుష్ట చర్యను ఖండించాయి. కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయబోమని ప్రకటించాయి. కానీ అన్ని విషయాల్లోనూ బిజెపికి మోకరిల్లిన మన రాష్ట్రంలోని వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు మాత్రం దీనిపై నోరుమెదపడం లేదు. వైసిపి రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయబోమని ప్రకటించాలి. 2019లో పార్లమెంటులో ఈ చట్టం చేసినప్పుడు కూడా ఈ పార్టీలు దానికి మద్దతిచ్చాయి. ఈ చట్టంవల్ల మత విద్వేషాలు ప్రజ్వరిల్లడమేకాకుండా దేశం మరో పాకిస్తాన్‌లాగా అస్థిరంగా మారే ప్రమాదం వుంది.

**రాజ్యాంగ విరుద్ధం...**

పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనది. రాజ్యాంగంలో 5వ అధికరణం నుండి 11వ అధికరణం వరకు పౌరసత్వం గురించిన విధి విధానాలను నిర్దేశించారు. వాటి ఆధారంగా ఉనికిలోకి వచ్చిందే 'పౌరసత్వ చట్టం–1955'. ఈ చట్టం ప్రకారం ఈ దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తీ, ఆ వ్యక్తి వారసులుగా ఉన్న ప్రతి వ్యక్తీ, భారతీయుడేనని తేల్చి చెప్పింది. ఈ దేశంలో నివసించటానికి సిద్ధపడిన వారికి కూడా సహజసిద్ధంగా పౌరసత్వం సంక్రమిస్తుందని ఈ చట్టం స్పష్టం చేసింది. కానీ ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం ఆమోదించిన పౌరసత్వ చట్టం– కుల, ప్రాంత, లింగ, జాతి, సాంస్కృతిక పరమైన వివక్షలకు అతీతంగా భారతీయులందరికీ సమాన పౌరసత్వ హక్కు కల్పించాలన్న రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతోంది. అందువల్ల పౌరసత్వ సవరణ చట్టం ఈ దేశంలోని ముస్లింల సమస్య కాదు. అది దేశ రాజ్యాంగానికీ, లౌకిక, ప్రజాస్వామ్యానికీ ముంచుకొస్తున్న ప్రమాదానికి సంబంధించిన సమస్య. లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగం స్థానంలో హిందూరాష్ట్ర ఏర్పాటుకు ఆర్ఎస్ఎస్–బిజెపిలు చేస్తున్న ప్రయత్నాల్లో నాడు బాబ్రీమసీదు కూల్చివేత, నేడు జమ్మూ–కాశ్మీర్‌ను చీల్చడం, 370వ అధికరణం రద్దు, ప్రస్తుత పౌరసత్వ సవరణ చట్టం తేవడం... ఇవన్నీ ఒక భాగం. ★

## రాజ్యాంగ మౌలిక సూత్రాలపై దాడి



ప్రొ. మాడభూషి శ్రీధర్

**మ**నం కేవలం రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాన్ని నడపాలి. రాజ్యాంగా న్ని మార్చు కోవచ్చు. కానీ మౌలిక సూత్రాలను సవరించ డానికి వీలు లేదు. కేశవానంద భారతి కేసులో 13 మంది న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుతో 50 ఏళ్లుగా ఈ రాజ్యాంగ బేసిక్ స్ట్రక్చర్‌ను (మౌలిక లక్షణాలు) కాపాడుకుంటూ వస్తున్నాము. బేసిక్ స్ట్రక్చర్ అంటే అపార్టుమెంట్‌లో కీలకమైన స్థంభాలు మార్చడానికి వీలు లేదు. అలా మార్చాల్సి వస్తే భవనం కూలిపోతుంది. అంటే స్థంభాన్ని మార్చకుండా తలుపులు, కిటికీలు, గోడలు మార్చుకోవడానికి వీలుంది. ఇదే బేసిక్ స్ట్రక్చర్! మాకు అధికారం ఉందని ప్రతీ పార్టీ రాజ్యాంగాన్ని మార్చుకుందామని అనుకుంటే అది సరైన పరిపాలన కాదు. రాజ్యాంగం మౌలిక లక్షణాలను దెబ్బతీసేలా కొత్త చట్టాలను తీసుకురావడానికి వీలు లేదు. ఈ నేపథ్యంలో పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) గురించి ఆలోచించాలి. పౌరసత్వాన్ని సవరిస్తూ 2019లో పలు మార్పులు తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఐదేళ్ల వరకు కూడా ఈ చట్టాన్ని అమలు చేయలేదు. చేయలేకపోయారు. ఈ సవరణ దేశానికి మంచిదని నమ్మడం లేదు. ఇన్నాళ్లు అంటే ఐదేళ్లుగా సిఎఎను అమలు చేయకుండా కేవలం ఎన్నికలకు ముందు ఈ రూల్స్ తెచ్చారు. అయితే చట్టం ఏం చెప్పినప్పటికీ ఆ నియమాల అమలు మాత్రం న్యాయంగా ఉంటుందా..? ఉండదా..? అనే అనుమానాలు పెరిగిపోయాయి. అందువల్లే నిరసనలు, విమర్శలు, పిల్స్ వేయడం, దిష్టి బొమ్మలు తగలబెట్టడం వంటి ఆందోళనలు ! మాకు 400 ఎంపిల సీట్ల కన్నా ఎక్కువగా వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని భయపెడుతున్నారు.

**అధికారాలను దెబ్బతీయలేరు.**

50 ఏళ్ల నాటి కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు చేసిన ఆదేశం ఇప్పటికీ ప్రామాణికంగానే ఉంది. కనుక భవిష్యత్తులోనూ కులాలు, మతాలు ఆధారంగా పరిపాలన చేయడానికి వీలు లేదు. ముఖ్యంగా పౌరసత్వ అర్హతలను మార్చే అధికారం ప్రభుత్వానికి లేదు. రాజ్యాంగ పీఠికలో లౌకిక అనే పదాన్ని తొలగించేస్తామని అంటున్నారు. పదం ఏ విధంగా ఉన్నా.. లేకపోయినా లౌకిక లక్షణాన్ని తీసివేసే అధికారం మాత్రం ఎవరికీ లేదు. కనుక సిఎఎ గురించి తీవ్ర సమస్యలు వస్తున్నాయి. సిఎఎ చట్టాన్ని మార్చి 11న అమలులోకి తీసుకొచ్చారు. వెంటనే ఎన్నో చోట్ల అల్లర్లు చోటు చేసుకున్నాయి. అనేక చోట్ల సాయుధ బలగాలను, ఢిల్లీలో పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ కూడా చేయాల్సి వచ్చింది. ఎన్నికల ముందు ఇంత కీలకమైన మార్పు చేయడం న్యాయమా..?, అవసరమా..?. రాజకీయ ప్రయోజనాల కోసమేనా? 1950లో జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత పౌరసత్వ మౌలిక లక్షణాలను రాజ్యాంగంలోని ఆర్టికల్స్‌లో పేర్కొన్నారు. వీటి ఆధారంగా 1955లో చట్టాన్ని తీసుకొచ్చారు. దీని ప్రకారం.పొరుగు దేశాల నుంచి వలస వచ్చిన వారికి భారత పౌరసత్వం ఇవ్వడానికి వీలు లేదు. మొట్టమొదటి పౌరసత్వ చట్టం (1955) ప్రకారం.. భారతీయ పౌరసత్వాన్ని అక్రమంగా వచ్చిన వారికి ఇవ్వరు. "ఒక వేళ పత్రాలు ఉంటే రావచ్చు. వీసా గడువు దాటి పోతే రావడానికి వీలు లేదు. అయితే వీసా గడువు ఉంటే ధృవీకరణాలు దొరికితే ముస్లీంయేతర శరణార్థులను దేశంలో నివసించడానికి అవకాశం ఇస్తూ మార్పులు చేశారు.

**మత ఆధారం ధర్మమా..?**

పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్‌లో హింసకు గురై భారత్‌కు శరణార్థులుగా వలస వచ్చిన ముస్లీమేతరులకు పౌరసత్వం మంజూరు చేయడానికి ఈ కొత్త సవరణ చట్టం ద్వారా అవకాశం లభిస్తుంది. అంటే ఈ మూడు దేశాల నుంచి భారత్‌కు వస్తే సరైన మిగతా 3లో

షహీన్ బాగ్ నిరసన (ఫైల్)




## వైసిపి, టిడిపి, జనసేన
# మౌనవ్రతం



**ము**స్లిం మైనార్టీల ఉనికిని దెబ్బకొట్టి వారి భవిష్యత్‌ను అంధకారం చేస్తున్న సిఎఎ (పౌరసత్వ సవరణ చట్టం) రూల్స్ నోటిఫై చేసి దేశాన్ని ప్రమాదంలోకి నెట్టిన బిజెపి కుతంత్రాలపై రాష్ట్రంలో వైసిపి టిడిపి జనసేన పార్టీలు నోరెత్తడం లేదు. మిగతా అనేక అంశాల మాదిరిగానే కేంద్రంలోని బిజెపి సర్కారుపట్ల ఈ మూడు పార్టీల లొంగుబాటు ఈ విషయంలోనూ వ్యక్తమవుతోంది.

కేరళ, తమిళనాడులాంటి కొన్ని రాష్ట్రాల మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ సిఎఎ అమలు చేయబోమని వైసిపి ప్రభుత్వం ప్రకటించడం అవసరం. మైనార్టీలను ఉద్ధరిస్తానని రోజూ గొప్పగా చెప్పే సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ఆ పని చేయకుండా ఎందుకు మౌనంగా ఉన్నారన్నది ప్రజల ప్రశ్న. ఎక్కడో మారుమూలన జరిగిన సంఘటనలపై పార్టీ తరపున అలాగే ప్రభుత్వం తరపునా మాట్లాడే పెద్దలు ఇప్పుడెందుకు పెదవి విప్పడం లేదో! మైనార్టీలకు చెందిన కొద్దిమంది నాయకులకు నామినేటెడ్ పదవులివ్వడమే సామాజిక న్యాయ కల్పన, లౌకికవాద పరిరక్షణ కాదు కదా! బిజెపి దురాగతాలను ప్రశ్నించకుండా మైనార్టీలను వైసిపి ఎలా రక్షిస్తుంది?

సిఎఎ ద్వారా ముస్లిం మైనార్టీల ఉనికిని దెబ్బతీస్తున్న బిజెపిని బలపరిచిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ప్రజలకేం సమాధానం చెబుతాయి? మైనార్టీలపై మెజార్టీ మతస్తులను రెచ్చగొట్టి ఉద్రిక్తతలను సృష్టించాలనుకున్న బిజెపితో కలిసి తెలుగుదేశం లౌకికవాదం ఎలా కాపాడుతుంది? తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపన సమయంలో లౌకికవాదానికి గట్టిగా కట్టుబడిన పార్టీ అది. ఉమ్మడి రాష్ట్రంలో మత ఘర్షణలను ఉక్కుపాదంతో అణచివేసిన చరిత్ర ఎన్‌టి రామారావుది. మత ఉద్రిక్తతల్ని రెచ్చగొట్టి మారణహోమానికి దారి తీసే అద్వానీ రథయాత్రను తీవ్రంగా వ్యతిరేకించింది టిడిపి. అలాంటి పార్టీ ఇప్పుడిలా మారిపోయిందేమిటని జనం ముక్కున వేలేసుకుంటున్నారు. ఒకప్పుడు విప్లవకారుడు చే గువేరా ఫొటోలతో వచ్చి ఇప్పుడు అమాంతం మతోన్మాద సావార్కర్ బొమ్మను ముందుంచుతున్న జనసేనాని బిజెపికి వంతదారుగా ఉండడం ఆశ్చర్యకరం కాదు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం కులం, మతం, రంగు, జాతి, ప్రాంతం, భాష ఆధారంగా ఎవరిపట్ల వివక్ష ఉండకూడదు, కానీ సిఎఎ మత ప్రాతిపదికన వివక్ష పాటిస్తోంది. రాజ్యాంగంలోని 19వ అధికరణం మతపరమైన స్వేచ్ఛ ఇస్తున్నప్పుడు ముస్లిములకు తప్ప ఇతరులకు పౌరసత్వం ఇస్తామని చెప్పడం రాజ్యాంగ ఉల్లంఘనే కదా! రాజ్యాంగ విరుద్ధమైన సిఎఎ ను వ్యతిరేకించడం దేశ భక్తులందరి కర్తవ్యం. ముఖ్యంగా బలహీనులకు భద్రత కల్పిస్తామని చెప్పే ఏ రాజకీయ పార్టీ అయినా చెయ్యాల్సింది అదే కదా! మరి ఇప్పటికైనా ఆ 'మూడు' పార్టీలు తమ వైఖరి వివరిస్తాయా? ★

# రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

**ఇతర దేశాల నుంచి వచ్చిన ముస్లిమేతరులకు మాత్రమే సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ (సిఎఎ) పేరుతో పౌరసత్వం ఇస్తామనడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం సిఎఎ అమలుకు నిబంధనలు జారీ చేసిన నేపథ్యంలో ఆయన ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి పి చంద్రయ్యతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే**




ఎం.ఎ.గఫూర్

**'పా**కిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాల నుంచి వచ్చిన కాందిశీకులకు పౌరసత్వ సవరణ చట్టం 2019 రూల్స్‌ను ఎన్నికల ముందు సిఎఎ చట్టంతో కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. బిజెపి ఆధీనంలోని కేంద్ర ప్రభుత్వం ముస్లిముల పట్ల వివక్ష చూపి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తోందని దీనినిబట్టి అర్థమవుతోంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాల నుంచి శరణార్థులుగా వచ్చిన వారిందరికీ పౌరసత్యం వ్యతిరేకించడం లేదా ఆమోదించడం వేరు. కేవలం ముస్లిముల పట్ల వివక్ష చూపడం ద్వారా హిందూత్వ అజెండాను బిజెపి రుద్దితే దేశ ప్రజలు ఆమోదించరు.. ప్రతిపక్షాలు, ప్రజాతంత్రవాదులు, రిటైర్డ్ బ్యూరోక్రాట్లు, న్యాయాధిపతులు ఇప్పటికే తమ వ్యతిరేకత వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చిన తరువాత మాత్రమే శరణార్థులు ఇక్కడికి వచ్చారని బిజెపి ప్రభుత్వం గుర్తించకపోవడం దుర్మార్గం. దేశంలో ఇప్పటికే కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు బిజెపి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతికేస్తున్నాయి. ఆయా దేశాల్లో అంతరంగిక కల్లోలం వంటి ప్రత్యేక పరిస్థితులు ఏర్పడినప్పుడు భారత్ శాంతికాముక దేశమని ఇక్కడికి వచ్చారు. వారికి ఈ దేశం ఆశ్రయం కల్పించింది. వారి సంతతి లక్షలాది మంది ఇక్కడే పుట్టి పెరుగుతున్నారు. దశాబ్దాలుగా ఇది తమ దేశమని వారు భావిస్తున్నారు.

**మతం ప్రాతిపదిక కారాదు...**

ఇటువంటి పరిస్థితుల్లో ముస్లిములను మినహాయించి, ఇతరులకు పౌరసత్వం ఇస్తామనడం సహజ న్యాయసూత్రాలకు, భారత రాజ్యాంగ స్ఫూరికి పూర్తి విరుద్ధం. ఏ దేశం నుంచి వచ్చినా, వారిలో తీవ్రమైన నేరచరిత్ర ఉన్నవారిని అనుమతించక పోవడాన్ని ఎవరూ అభ్యంతరం పెట్టరు. అయితే, దీనికి మతం ప్రాతిపదిక కారాదు. మన నుంచి విడిపోయిన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన వారిలో అత్యధికులు ముస్లిములే. బర్మా నుంచి వచ్చిన రోహింగ్యాలలో కూడా ముస్లిములు ఉన్నారు. శ్రీలంక తదితర దేశాల నుంచి కూడా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో లక్షలాది మంది ప్రజలు శరణార్థులుగా మన దేశానికి వచ్చారు. వీరికి పౌరసత్వం ఇవ్వడానికి మతం ప్రాతిపదిక కారాదు. సిఎఎ చట్టం రాక పూర్వమే అస్సాంలో ఈ ప్రయోగం జరిగింది. నేషనల్ సిటిజన్‌షిఫ్ రిజిస్టర్ పెట్టి ప్రతి ముస్లిం పూర్వీకుల ఆధారాలు తేవాలని చెప్పారు. ఆధారాలు చూపని వారిని బలవంతంగా ప్రత్యేక శిబిరాలకు తరలించారు. అస్సాంలో తల్లిదండ్రులు ఉండి పిల్లలు ఇతర రాష్ట్రాలలో చదివి వచ్చాక వారు ఆధారాలు చూపలేదని ఇబ్బందులకు గురి చేశారు. ఈ తరహానే బిజెపి ప్రభుత్వం దేశమంతటా అమలు చేస్తుందనే భయాలు ముస్లిముల్లో ఉన్నాయి.




మనదేశంలో పుట్టినప్పటికీ పేద ముస్లిములకు స్థిరాస్తులు లేవు. అస్సాం తరహాలో ఎన్ఆర్‌సిలు ఇతర రాష్ట్రాల్లో కూడా తయారు చేస్తే ఇటువంటి వారు ఆధారాలు చూపడం కష్టమవుతుంది. మన దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ భారతీయ పౌరులేనని రాజ్యాంగం చెప్తోంది. ప్రస్తుత సిఎఎ నోటిఫికేషన్ రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నం.

**లౌకిక, ప్రజాతంత్ర శక్తులు కదలాలి**

కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలు దీనిని అమలు చేయబోమని చెప్పాయి. మన రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేనలు బిజెపిని బలపరుస్తున్నారు. బిజెపి ప్రయోగాలను అడ్డుకునే శక్తులు మన రాష్ట్రంలో బలహీనంగా ఉండడంతో సిఎఎను అమలు చేయడం సులభమ వుతుంది. రాష్ట్రం లోని లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకుపోయి కేంద్ర ప్రభుత్వ అజెండాను అడ్డుకోవాలి. పౌరసత్వం పేరుతో దేశంలోని ముస్లిముల కు పౌరసత్వం లేకుండా చేస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించకుండాపోతాయి. చివరికి ఓటింగులో పాల్గొనకుండా చేయాలని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. హిందూత్వ ఎజెండాతో బిజెపి ముందుకు వెళ్తోందని సిపిఎం మొదటి నుంచి హెచ్చరిస్తూ వస్తోంది. బిజెపి ఇప్పుడు దానిని బలవంతంగా అమలు చేయాలని చూస్తోంది. ★




# తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

## సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో

**న్యూఢిల్లీ :** పౌరసత్వ చట్ట సవరణ (సిఎఎ) నిబంధనలను ప్రకటించడాన్ని సిపిఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకించింది. పార్టీ పొలిట్‌బ్యూరో మంగళవారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. పౌరసత్వాన్ని మతపరమైన గుర్తింపుతో ముడిపెట్టడం ద్వారా ఈ సిఎఎ రాజ్యాంగంలో పొందుపరిచిన పౌరసత్వ లౌకిక సూత్రాన్ని ఉల్లంఘిస్తోందని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

ఈ చట్టం కింద నోటిఫై చేసిన నిబంధనలు ఆచరణలో పొరుగు దేశాల నుండి వచ్చిన ముస్లింల పట్ల వివక్షాపూరిత వైఖరిని అనుసరించనున్నాయి. పైగా ఈ చట్టం అమలును జాతీయ పౌర పట్టిక (ఎన్‌ఆర్‌సి) ఏర్పాటుతో ముడిపెట్టడాన్ని బట్టి చూస్తే ఈ నిబంధనలు ముస్లిం సంతతికి చెందిన పౌరులను లక్ష్యంగా చేసుకుంటారనే భయాందోళనలు రేకెత్తించేవిగా ఉన్నాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

తమ రాష్ట్రాల్లో పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునే వ్యక్తులను గుర్తించడం, వారి పేర్లను నమోదు చేసుకోవడం వంటి ప్రక్రియ నుండి రాష్ట్ర ప్రభుత్వాలను పూర్తిగా మినహాయించేలా ఈ నిబంధనలను రూపొందించారని, సిఎఎను తీవ్రంగా వ్యతిరేకించిన రాష్ట్ర ప్రభుత్వాలను మినహాయించేందుకే ఇదంతా చేస్తున్నారని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

సిఎఎను ఆమోదించి నాలుగేళ్ళకు పైగా గడిచిన తర్వాత, అందునా లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడానికి కొద్ది రోజులు ముందుగా ఈ నిబంధనలను ప్రకటించడం చూస్తుంటే సిఎఎ అమలును విచ్ఛిన్నకర, మతపరమైన పోలరైజేషన్ (చీలిక) కోసం ఉపయోగించుకోవాలన్నదే బిజెపి ఎత్తుగడగా ఉందని స్పష్టమవుతోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ రీత్యా సిఎఎను, దాని అమలును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఈ వినాశకర సిఎఎను రద్దు చేసేదాకా తమ యత్నాలు కొనసాగుతాయని పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది.

### ప్రజల దృష్టి మళ్లించడానికే



బిజెపి ప్రతి ఎన్నికలకు ముందు ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఏదో ఒక సెన్సేషనల్ సమస్యను ముందుకు తీసుకొస్తూ ఉంటుంది. ఈసారి సిఎఎను ముందుకు తెచ్చింది.హిందూ ఓటర్లను పోలరైజేషన్ చేస్తోంది. ముస్లిములను అణగదొక్కుతామని బహిరంగ సందేశం ఇస్తోంది. హిందుూత్వ శక్తుల్లో ఉత్సాహాన్ని నింపి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోంది.

**- ఆచార్య మన్సూర్ రెహమాన్, ఆర్థికవేత్త**

### మతాల పేరుతో చూడొద్దు



ఈ చట్టం ద్వారా ప్రజల పట్ల వివక్ష చూపరాదు.. మతాల పేరుతో కాకుండా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజలనూ సంతృప్తి పరచాలి. మేము భారతీయులుగా ఉండాలనుకునేలా ప్రతి ఒక్కరినీ బతకనివ్వాలి. మతం పేరుతో వేరుగా చూడడం సరికాదు.

**-ఎమ్‌డి అజ్మల్, టిడిపి జిల్లా కార్యదర్శి, ఆకివీడు,**

# రాజకీయ ప్రయోజనాల కోసమే

**న్యూఢిల్లీ :** సిఎఎను అమల్లోకి తెచ్చినట్లు కేంద్రంలోని బిజెపి ప్రకటించడంపై వివిధ రాజకీయపార్టీల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.



బిజెపి తన రాజకీయ ప్రయోజనాల కోసం మతపరమైన మనోభావాలను ఉపయోగించుకోవడానికే సిఎఎను అమలు చేస్తున్నట్లు ప్రకటించిందని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షులు ఎంకె స్టాలిన్ విమర్శించారు. అలాగే 'మునిగిపోతున్న బిజెపి అనే నౌకను రక్షించుకోవడానికి మోడీ చేస్తున్న ప్రయత్నం' అని కూడా స్టాలిన్ విమర్శించారు. ముస్లింలకు, శ్రీలంకకు చెందిన తమిళులకు ద్రోహం చేయడం ద్వారా మోడీ ప్రజల మధ్య విభజనకు బీజం వేశారని స్టాలిన్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి చేస్తున్న ఈ రాజకీయాలకు ప్రజలు సరైన బుద్ధి చెబుతారని కూడా స్టాలిన్ తెలిపారు. కాగా, సిఎఎను తమిళనాడులో అమలు చేయమని జనవరిలోనే స్టాలిన్ ప్రకటించారు.

**కేరళలో అమలు చేయం : పినరయ్**




సిఎఎను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసినా కేరళలో మాత్రం ఆ చట్టాన్ని అమలు చేయబోమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పష్టం చేశారు. మతపరమైన మార్గాల్లో ప్రజల్లో విభజన సృష్టించే చట్టంగా సిఎఎను విజయన్ విమర్శించారు. దేశంలో కల్లోలం రేపే లక్ష్యంతోనే బిజెపి దీనిని అమలు చేస్తున్నట్లు ప్రకటించిందని అన్నారు. ప్రజలను విభజించే, మతభావాలను రెచ్చగొట్టే, రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలను దెబ్బతీసే ఈ చట్టాన్ని అంతా ఐక్యంగా వ్యతిరేకించాలని విజయన్ పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో భాగంగానే దీన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు విజయన్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'ముస్లిం మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించే సిఎఎను కేరళలో అమలు చేయబోమని మా ప్రభుత్వం పదేపదే తెలిపింది. దానికే కట్టుబడి ఉంది. ప్రజల మధ్య మత విభజన తెచ్చే ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేరళ అంతా ఏకతాటిపై నిలబడాలి' అని ప్రకటనలో విజయన్ తెలిపారు. సిఎఎ 2019ను అమల్లోకి తెచ్చినట్లు కేంద్రం ప్రకటించిన గంటల వ్యవధిలోనే విజయన్ ఈ ప్రకటన విడుదల చేశారు.

**వివక్ష చూపితే వ్యతిరేకిస్తాం : మమత బెనర్జీ**



ప్రజల హక్కులను కాలరాచే విధంగా వుంటే సిఎఎను, తాము వ్యతిరేకిస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. సిఎఎ దేశంలో నివసించే ప్రజల సమూహాలపై వివక్ష చూపేదిగా వున్నా లేదా వారి ప్రస్తుత పౌరసత్వ హక్కులను హరించేదిగా వున్నా ఈ చట్టాన్ని తమ రాష్ట్రంలో అమలు చేయమని మమతా చెప్పారు.

**ఇది విభజన రాజకీయం : కాంగ్రెస్**



లోక్‌సభ ఎన్నికలకు ముందు సిఎఎ అమలు చేస్తున్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించాన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుపట్టింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, అస్సాంల్లో ఎన్నికల్లో ప్రయోజనాల కోసం బిజెపి తన సంకుచిత రాజకీయాలతోనే దీన్ని ప్రకటించిందని విమర్శించింది. కాంగ్రెస్ నాయకులు జైరాం రమేష్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎన్నికల బ్యాండ్ల విషయంలో ఎస్‌బిఐ పిటీషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిన విషయాన్ని మీడియాలో హెడ్‌లైన్ల నుంచి తప్పించడానికి, కేంద్రం ఈ నిర్ణయాన్ని ప్రకటించిందని కూడా ఆరోపించారు. 2019 డిసెంబరులో పార్లమెంట్ ఆమోదించిన చట్టానికి సంబంధించిన నిబంధనలను నోటిఫై చేయడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి నాలుగేళ్ల మూడు నెలల సమయం పట్టిందని విమర్శించారు. కేవలం ఎన్నికలకు ముందు సంకుచిత రాజకీయాల కోసమే ఈ నోటిఫికేషన్‌ను కేంద్రం తీసుకొచ్చిందని ఆరోపించారు.

**ప్రజల దృష్టి మళ్లించడానికే : అఖిలేష్ యాదవ్**



వివిధ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే సిఎఎ అమలు చేస్తున్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించిందని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎస్‌పి నాయకులు అఖిలేష్ యాదవ్ విమర్శించారు. బిజెపి రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. ఈ మేరకు అఖిలేష్ యాదవ్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. 'ప్రస్తుతం దేశంలోని అనేక మంది పౌరులు బ్రతుకు తెరువు కోసం బలవంతంగా ఇతర దేశాలకు వెళుతున్న సమయంలో.. విదేశీయుల కోసం సిఎఎను తీసుకురావడం వల్ల ఏమి జరుగుతుంది? బిజెపి రాజకీయాల ను ప్రజలు అర్థం చేసుకుంటున్నారు' అని అఖిలేష్ యాదవ్ పోస్ట్ చేశారు.

'తమ పదేళ్ల పాలనలో లక్షలాది మంది పౌరులు దేశ పౌరసత్వాన్ని ఎందుకు వదులుకున్నారో బిజెపి ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. అలాగే లోక్‌సభ ఎన్నికలు తరువాత 'ఎన్నికల బాండ్లు, పిఎం కేర్ ఫండ్' గురించి కూడా వివరణ ఇవ్వాలి' అని అఖిలేష్ యాదవ్ జోడించారు.

### మత విభజన సరికాదు



శరణార్థులకు పౌరసత్వం కల్పించే విషయంలో మతపరమైన విభజన సరైంది కాదు. ఇది అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధం. ఐక్యరాజ్య సమితి భద్రత సమాఖ్యలో శాశ్వత సభ్యత్వం కోసం ప్రయత్నిస్తున్న మనం ఆదర్శవంతంగా ఉండాల్సిన అవసరం ఉంది. శరణార్థులుగా వచ్చిన అందరికీ అవకాశం కల్పించాలి. అలాకాకుండా మతం, ప్రాంతం పేరుతో మినహాయింపు ఇవ్వడం సరైంది కాదు.

**-చంద్రశేఖర్, మానవ హక్కుల వేదిక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సమన్వయకర్త**

### అమలు చేయబోం



రాష్ట్రంలో ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఎ, సిఎఎ చట్టాలను అమలు చేయబోం. అప్పట్లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ చట్టాల గైడ్‌లైన్స్‌ను అధ్యయనం చేసిన తరువాత అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే ఇటువంటి పన్నాగాలు పన్నుతోంది. మతపరంగా వేరు చేసి చూడకుండా అర్హులైన వారందరికీ పౌరసత్వం ఇవ్వాలి.

**- ఎస్‌బి.అంజాద్ బాషా, ఉప ముఖ్యమంత్రి**


### ముస్లిములపై ఉక్కుపాదం



ముస్లిం, మైనారిటీలపై ఉక్కు పాదం మోపేందుకు మోడీ ప్రభుత్వం సిఎఎ చట్టాన్ని ముందుకు తీసుకొచ్చింది. భారత పౌరసత్వం కోరే శరణార్థులకు కొన్ని నిబంధనల మేర పౌరసత్వం ఇచ్చే వెసులుబాటు ఉండేది. భారత్ పొరుగు దేశాల నుంచి వచ్చే హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, పార్శీలు, జైనులు బౌద్ధులకు భారత పౌరసత్వం వర్తించేలా చేయడం, ముస్లిములపై వివక్ష చూపడం దుర్మార్గం.

**-ఎస్‌ఎం షరీఫ్, రిటైర్డ్ ఉద్యోగి, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా**

### రాజ్యాంగ లౌకిక సూత్రాలకు విరుద్ధం



మతపరమైన గుర్తింపుతో కల్పించే పౌరసత్వ ప్రక్రియ రాజ్యాంగ లౌకిక సూత్రాలకు పూర్తి విరుద్ధం. విచ్ఛిన్న వ్యూహంలో భాగంగా పౌరసత్వ దరఖాస్తులను గుర్తించి నమోదు చేసే ప్రక్రియ నుంచి రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం తప్పించడం తగదు. ఈ చర్యలను ప్రజాస్వామిక వాదులు సమిష్టిగా ఎదుర్కోవాలి. తెలుగు రాష్ట్రాల్లో వైసిపి, జనసేన, టిడిపి, బిఆర్‌ఎస్ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలి.

**- దూసర్లపూడి రమణరాజు, సామాజికవేత్త, కాకినాడ**


### కోర్టు ధిక్కారమే



పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీలను సస్పెన్షన్ చేసి బిజెపి ఎంపీల మందబలంతో సిఎఎ, ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఎ వంటి చట్టాలను ఆమోదింపజేసుకుంది. పార్లమెంట్‌లో ఆమోదం పొందిన చట్టాలను ఆర్నెల్లలోపు అమలు చేయాలి. లేనిపక్షంలో మరోసారి ఆమోదం పొందాలి. ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఎ, సిఎఎ చట్టాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో 200పైగా కేసులు పెండింగ్ ఉన్నందున సిఎఎ అమలుకు పూనుకోవడం కోర్టు ధిక్కారమే.

**- పఠాన్ మహ్మద్ అలీఖాన్, సీనియర్ అడ్వకేట్, కడప**

### లౌకికవాదానికి విరోధం



ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా మనది లౌకికవాద, ప్రజాస్వామ్య దేశం. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సిఎఎ లౌకికవాదానికి విరోధం. వేరే దేశాల నుంచి ఎందుకు వలస వస్తున్నారని విచారించి పౌరసత్వం ఇవ్వాలి. అంతేకానీ కుల, మతాల ప్రాతిపదికన పౌరసత్వం ఇవ్వడం సరైంది కాదు.

**- కురాడి చంద్రశేఖర్ కల్కూర, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు, కర్నూలు**

### ముస్లిములకు రక్షణ ఉండదు



దేశం కోసం స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన ముస్లిములపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్షగట్టింది. మత ఘర్షణలకు పునాది వేస్తోంది. భిన్న మతాలు, ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతులకు నిలయమైన మన దేశానికి ఈ చట్టం ఏ మాత్రమూ శ్రేయస్కరం కాదు. మత మరణహోమాన్ని రగిలించే శక్తుల ఆట కట్టించేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలి. సిఎఎని, బిజెపి ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి.

**-బషీరుద్దీన్, బిటెక్ విద్యార్థి, జుజ్జూరు, వీరులపాడు మండలం, ఎన్‌టిఆర్ జిల్లా**

### లౌకికవాదానికి గొడ్డలిపెట్టు



లౌకికవాదానికి ఇది గొడ్డలి పెట్టు. దీని వెనక రహస్య అజెండా దాగి ఉన్నట్లు అనిపిస్తోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే దీనిని తెరపైకి తెచ్చినట్లు కనిపిస్తోంది. యాంటీ ముస్లిం ఓట్లను పొందేందుకు దీనిని తెరపైకి తెచ్చినట్లు స్పష్టమవుతోంది. ఇదొక విభజన వాదం. ఒక సమూహాన్ని ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడాలనుకోవడం దేశ సమగ్రతకు విఘాతం కలిగిస్తుంది. దేశ ప్రజలకు దీనివల్ల ముప్పే కానీ మంచేమీ లేదు.

**డాక్టర్ గోవాడ వీర్రాజు, హెచ్‌ఒడి, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం**

### అందరూ కలిసున్నారు



సిఎఎ చట్టం ఇప్పుడు తీసుకురావాల్సిన అవసరం లేదు. భారత్ లౌకిక దేశం. హిందువులు, ముస్లిములు, క్రిస్టియన్లు, సిక్కులు ఇలా అందరూ కలిసి స్నేహితులుగా ఉన్నారు. ఇలాంటి సమయంలో ఈ చట్టాలు తీసుకురావడం వల్ల దేశంలో విద్వేషాలు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. స్నేహితులుగా ఉన్న వారి మధ్య గొడవలకు దారితీస్తుంది. దేశాభివృద్ధికి ఆటంకంగా మారనున్న ఈ చట్టం అమలు పట్ల కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలి.

**- రాజశేఖర్, నెల్లూరు**

### ఎన్‌ఆర్‌సితో ముడిపెట్టే ప్రమాదం



అతి త్వరలో ఎన్నికలు రాబోతున్నందున జాతీయవాదం ముసుగులో హిందూత్వ రాజకీయాలను మరొకసారి తెరమీదకి తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగానే సిఎఎ నోటిఫికేషన్‌ను బిజెపి జారీ చేసింది. దీన్ని ముస్లిం సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. భవిష్యత్తులో ఎన్‌ఆర్‌సితో ముడిపెట్టి ముస్లిం సమాజాన్ని ధ్రువీకరణ పత్రాలు అడిగే ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది. ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి.

**- పఠాన్ కరీముల్లా ఖాన్, కన్వీనర్, ముస్లిం సామాజిక హక్కుల వేదిక, ప్రకాశం జిల్లా**

### రాజ్యాంగ వ్యతిరేకం



ఇది రాజ్యాంగ వ్యతిరేక, వివక్షా పూరిత చట్టం. తరతరాలుగా మన దేశంలో నివసిస్తున్న ముస్లిములను విదేశీయుల అక్రమ చొరబాటును నిరోధించే నెపంతో పౌరసత్వ పత్రాలు చూపమంటోందీ చట్టం. పత్రాలు చూపడం సాధ్యం కాని వారిని నాజీలు ఆనాడు శిబిరాల్లో బంధించినట్టు నిర్బంధిస్తారు. ఈసారి ఎన్నికల్లో హిందూ ఓట్లను కొల్లగొట్టడానికి 'రామమందిర్' చాలదని ఇప్పుడు బుట్టలో పాముని బిజెపి బయటకు తీసింది.


**- అట్టాడ అప్పలనాయుడు, రచయిత**

# అబద్ధాలు, అర్ధ సత్యాలు



**-సిద్ధార్థ వరదరాజన్**

**పౌరసత్వ (సవరణ) చట్టంలోని వివక్షపై వస్తున్న విమర్శలకు జవాబు చెప్పే ప్రయత్నంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మార్చి 12న ప్రశ్నలు- సమాధానాల పేరుతో ఒక పత్రాన్ని విడుదల చేసింది. ఆ పత్రం చదవడానికే చిరాకుపుట్టిస్తుంది. అసంబద్ధమైన వివరణలు, అర్ధసత్యాలు, అబద్ధాలతో అది నిండి ఉంది. నేను అడిగిన ప్రశ్నలు, హోంశాఖ సమాధానాలు, ప్రతి ప్రత్యుత్తరానికి నా విశ్లేషణ ('వాస్తవం') ఇస్తున్నాను.**




**సిఎఎ అమలుకు నిబంధనలు నోటిఫై చేస్తూ హోంమంత్రిత్వ శాఖ ఏం చెప్పింది?**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇతర మతాలకు చెందిన భారతీయ పౌరుల మాదిరిగానే భారతీయ ముస్లిములు సాధారణంగా అన్ని సౌకర్యాలూ పొందుతున్నందున ఆ హక్కులు అనుభవించడానికి స్వేచ్ఛ, అవకాశాన్ని తగ్గించకుండా, పౌరసత్వ సవరణ చట్టం 2019 అర్హత వ్యవధిని తగ్గించింది. ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ లేదా పాకిస్తాన్‌లో మతపరమైన కారణాలతో హింసించబడిన, డిసెంబరు 31, 2014 లేదా అంతకుముందు భారతదేశంలోకి ప్రవేశించిన లబ్ధిదారులు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునే అర్హత కాలపరిమితిని 11 నుండి 5 సంవత్సరాలకు తగ్గించింది. ఇది వేధింపులకు గురైనవారికి ఊరట కల్పించడం కోసమే..

**వాస్తవం :** " వేధింపులకు గురైనవారిని శాంతింపజేసేందుకు పరిహారం" అంటే ఏమిటో నాకు తెలియదు, కానీ, ప్రభుత్వం చెబుతున్నదాంట్లో నిజాయితీ లేదు. హింసకు గురైన బాధితులకు ప్రయోజనం చేకూర్చడం, వారి పట్ల 'ఉదారంగా వ్యవహరించడం ' ప్రభుత్వ ధ్యేయమైతే ఈ మూడు దేశాలకు చెందిన శరణార్థులకు మాత్రమే దీనిని ఎందుకు పరిమితం చేశారు?

ఈ మూడు దేశాల్లోని ప్రజలు రాజకీయ హింస, జాతి లేదా లింగం ఆధారంగా వేధింపులు ఇతర రకాల హింసలను తట్టుకోలేక శరణార్థులుగా పారిపోయివచ్చినప్పుడు వారిని ఆదుకోడానికి ఒక్క మతపరమైన హింస మాత్రమే ఎందుకు ప్రాతిపదికగా పరిగణించబడుతుంది?

ఈ దేశాల్లో ముస్లింలు నిజంగా హింసించబడుతున్నారని రుజువు ఉన్నప్పుడు, మతపరమైన హింసకు గురయ్యే వారి జాబితా నుండి ముస్లిములను ఎందుకు మినహాయించారు? ఈ మూడు దేశాల్లో మతపరమైన హింసకు గురవుతున్న ముస్లిమేతరులకు సహాయం చేయడమే లక్ష్యం అయితే, డిసెంబర్ 31, 2014 కటాఫ్ తేదీ ఎందుకు? ఆ తేదీ తర్వాత భారతదేశానికి పారిపోవడానికి తగిన కారణాలను కలిగి ఉన్న లేదా హింస నుండి తప్పించుకోవడానికి ఇప్పటికీ ఇక్కడకు పారిపోయి వచ్చిన బాధితులను ప్రభుత్వం ఎలా ట్రీట్ చేయాలని ప్రతిపాదిస్తుంది? ఈ ప్రశ్నలకు మోడీ ప్రభుత్వం వద్ద సమాధానం లేదు, సిఎఎను అమలు చేయడానికి ఈ శరణార్థులకు ఈ "ఉదారత చూపడానికి' నాలుగున్నర సంవత్సరాలు ఎందుకు పట్టిందో వివరించలేదు.

**భారతదేశంలో నివసిస్తున్న ముస్లిములకు చట్టం వల్ల ఎదురయ్యే చిక్కులేమిటి?**

**హోంమంత్రిత్వ శాఖ :** భారతీయ ముస్లిములు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, ఎందుకంటే సిఎఎ వారి పౌరసత్వాన్ని ప్రభావితం చేయడానికి ఎటువంటి నిబంధనలు చేయలేదు. వారు హిందూ సహచరుల వలె సమాన హక్కులు కలిగి ఉన్న ప్రస్తుత 18 కోట్ల భారతీయ ముస్లిములతో ఎటువంటి సంబంధం లేదు. ఈ చట్టం తర్వాత ఏ భారతీయ పౌరుడూ తన పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి ఎలాంటి పత్రాన్ని సమర్పించాలని అడగరు.

**వాస్తవం :** శరణార్థులు, చొరబాటుదారుల పట్ల మోడీ ప్రభుత్వ విధానాల విషయానికి వస్తే 'కాలక్రమం' పని చేస్తుందని హోంమంత్రి అమిత్ షా గతంలో చాలాసార్లు చెప్పారు. ఏప్రిల్ 2019లో, ఆయన ఇలా అన్నారు. : "మొదట మేము పౌరసత్వ సవరణ బిల్లు తీసుకొస్తాము, ప్రతి శరణార్థికి పౌరసత్వం లభిస్తుంది. ఆ తర్వాత మేము పౌరుల జాతీయ రిజిస్టర్‌ను తీసుకొస్తాము. కాబట్టి శరణార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కానీ చొరబాటుదారులు కచ్చితంగా ఆందోళన చెందడానికి కారణం ఉంది. కాబట్టి కాలక్రమాన్ని అర్థం చేసుకోండి." ఎన్‌ఆర్‌సి బెంగాల్‌కు మాత్రమే కాకుండా దేశం మొత్తానికి ఉపయోగపడుతుంది. ఎందుకంటే "అన్నిచోట్లా చొరబాటుదారులు ఉన్నారు" అని ఆయన అన్నారు. డిసెంబర్ 10, 2019న, షా పార్లమెంటులో సిఎఎ కచ్చితంగా వస్తుందని, అది అమలు చేయబడినప్పుడు "ఒక చొరబాటుదారుడు కూడా తనను తాను రక్షించుకోలేడు" అని చెప్పారు. అంటే అర్థమేమిటి? సిఎఎ అనేది భారతదేశంలోని ప్రతి వ్యక్తి యొక్క పౌరసత్వ స్థితిని వారు అందించే పత్రాల ఆధారంగా పరీక్షిస్తారని చెప్పడం కాదా? ఈ ఎన్‌ఆర్‌సిని అస్సాంలో, మొదట నిర్వహించారు. ఫలితాలు వినాశకరంగా ఉన్నాయి. దాదాపు 19 లక్షల మంది పౌరులుగా మినహాయించబడ్డారు. వీరు అవసరమైన డాక్యుమెంటేషన్‌ను తయారుచేయలేకపోయిన భారతీయులు. మెజారిటీ హిందువులు. సిఎఎ వెనుక ఉద్దేశం ఏమిటంటే, సిఎఎ ప్రక్రియను సంతృప్తి పరచడంలో విఫలమైన హిందువులకు, సరైన పత్రాలు లేకున్నా పౌరసత్వానికి అనుమతించినందున వారిని బహిష్కరించటం లేదా హక్కులు లాగేసుకోవడం అన్న ప్రశ్నే రాదు. వారికి ఈ సిఎఎ అటువంటి భరోసా ఇస్తుంది. . అదే ముస్లింలు సరైన పత్రాలు ఇవ్వడంలో విఫలమైతే వారికి'చొరబాటుదారులు'గా ముద్ర వేసే ప్రమాదం ఉంది.

నేను పేర్కొన్నట్లుగా, ఇద్దరు భారతీయ స్త్రీలు అంటే ఒక హిందూ, ఒక ముస్లిం, ఇద్దరూ పత్రాలు లేని బంగ్లాదేశ్ పురుషులను, ఒక హిందూ, ఒక ముస్లింను వివాహం చేసుకున్న ఉదాహరణనే తీసుకోండి. సవరించిన పౌరసత్వ చట్టం ప్రకారం, ఇద్దరు మహిళల పిల్లలను 'అక్రమ వలసదారులు'గా పరిగణిస్తారు, వారి తండ్రులతోపాటు బహిష్కరణకు గురవుతారు. అయితే, బహిష్కరణ కారణంగా అంతరాయం కలిగించే ప్రమాదం లేకుండా సాధారణ కుటుంబ జీవితాన్ని గడపడానికి హిందూ భారతీయ స్త్రీకి సిఎఎ స్పష్టమైన మార్గాన్ని అందిస్తుంది. కానీ ముస్లిం భారతీయ స్త్రీ తన కుటుంబాన్ని భారతదేశం నుండి బహిష్కరణకు గురయ్యే భయంతో జీవన సాగించాలి. ఆమె కుటుంబాన్ని బహిష్కరిస్తే, ఆమె వారితో కలిసి జీవించాలని కోరుకుంటే భారతదేశాన్ని విడిచిపెట్టడం తప్ప వేరే మార్గం ఉండదు.

**అక్రమ వలసదారులెవరు?**

హోంమంత్రిత్వ శాఖ: పౌరసత్వ చట్టం, 1955 వలె, ఈ సిఎఎ చట్టవిరుద్ధమైన వలసదారుని చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా భారతదేశంలోకి ప్రవేశించిన విదేశీయుడిగా నిర్వచిస్తుంది.

**వాస్తవం:** 2003లో, అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం పౌరసత్వ చట్టాన్ని సవరించి 'అక్రమ వలసదారులు' సహజత్వం లేదా వివాహం ద్వారా భారత పౌరసత్వాన్ని పొందకుండా నిషేధించింది. 2016లో పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ నుండి ముస్లిమేతర 'అక్రమ వలసదారులు' డిసెంబర్ 31, 2014కు ముందు భారతదేశంలోకి ప్రవేశించినట్లైతే, వారికి ఈ నిబంధన నుండి మినహాయింపు ఇస్తుంది. అంతేకాదు, వారి పౌరసత్వ నమోదు ప్రక్రియను ఇది మరింత వేగవంతం చేస్తుంది.

మరో మాటలో చెప్పాలంటే, నేటి చట్టం ప్రకారం, డిసెంబర్ 31, 2014 వరకు చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా భారతదేశంలోకి ప్రవేశించిన పాకిస్తాన్, బంగ్లాదేశ్ లేదా ఆఫ్ఘనిస్తాన్ నుండి విదేశీయుడు ముస్లిం అయితే మాత్రమే అక్రమ వలసదారుగా పరిగణించబడతారు. ముస్లిమేతరులందరూ ఇకపై అక్రమ వలసదారులుగా పరిగణించబడరు. మతం ఆధారంగా ఈ వివక్ష భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. న్యాయవాది ఎస్ ప్రసన్న పేర్కొన్నట్లుగా, ఈ వివక్ష పౌర, రాజకీయ హక్కుల అంతర్జాతీయ ఒడంబడిక కింద భారతదేశం బాధ్యతలను కూడా ఉల్లంఘించడమేనని, ఇందులోని ఆర్టికల్ 26 ఇలా పేర్కొంది.

"చట్టం ముందు అందరూ సమానమే, చట్టం యొక్క సమాన రక్షణకు ఎలాంటి వివక్ష లేకుండా అందరూ అర్హులే. ఈ విషయంలో, చట్టం జాతి, రంగు, లింగం, భాష, మతం, రాజకీయ లేదా ఇతర అభిప్రాయం, జాతీయ లేదా సామాజిక మూలం, ఆస్తి, పుట్టుక లేదా వంటి విషయాన్ని వివక్షకు వ్యతిరేకంగా వ్యక్తులందరికీ సమానమైన, సమర్థవంతమైన రక్షణను ఇస్తుంది.

**భారత పౌరసత్వం కోరకుండా ముస్లిములకు ఏదైనా అడ్డంకి ఉందా?**

**హోంమంత్రిత్వ శాఖ:** లేదు. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6 కింద భారతీయ పౌరసత్వాన్ని కోరేందుకు ప్రపంచంలో ఎక్కడి నుండైనా ముస్లిములకు ఎటువంటి నిషేధం లేదు. ఇది సహజత్వం ద్వారా పౌరసత్వంతో వ్యవహరిస్తుంది.

**వాస్తవం:** 2003 నుండి, పౌరసత్వ చట్టం చట్టవిరుద్ధంగా వలస వచ్చిన ఎవరైనా భారతదేశ పౌరసత్వాన్ని పొందకుండా నిరోధించింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నుండి అక్రమ వలసదారులు, భారతదేశంలో జన్మించిన ముస్లిమేతరుల పిల్లలకు భారత పౌరసత్వం పొందడానికి సిఎఎ తలుపులు తెరుస్తుంది. అయితే అక్రమ వలసదారులకు, ముస్లిములుగా మారిన వారికి భారతదేశంలో జన్మించిన పిల్లలు పౌరసత్వం పొందకుండా నిషేధించబడతారు.

**సవరణ అవసరం ఏమిటి?**

**హోంమంత్రిత్వ శాఖ :** ఆ మూడు దేశాల్లోని హింసకు గురవుతున్న మైనారిటీలపై దయ చూపేందుకు, ఈ చట్టం భారతదేశ సంస్కృతి ప్రకారం వారి సంతోషకరమైన, సుసంపన్నమైన భవిష్యత్తు కోసం భారతీయ పౌరసత్వాన్ని పొందేందుకు వారికి అవకాశం కల్పిస్తుంది. అక్రమ వలసదారులను నియంత్రించడానికి ఈ చట్టం అవసరం.

**వాస్తవం :** హింసించబడిన వ్యక్తుల పట్ల ఉదారతను చూపడానికి మతం ఆధారిత మినహాయింపును సృష్టించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం చేయవలసిందల్లా, భారతదేశంలోని అక్రమ వలసదారులెవరైనా తమ మూలం ఉన్న దేశంలో హింసకు గురవుతారనే భయంతో భారతదేశంలో నిరవధికంగా ఉండేందుకు అనుమతించబడతారని, తగిన సమయంలో, భారత పౌరసత్వం కోసం అర్హులుగా ఉండవచ్చని చెప్పడమే. వాస్తవానికి, శరణార్థుల సహజీకరణ కోసం ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు అనుసరించే మార్గం ఇదే శరణార్థులు నిర్దిష్ట మతానికి చెందినవారు కానవసరం లేదు.

**ఏదైనా ఇతర దేశాల నుండి వచ్చే ముస్లిం వలసదారులకు ఏదైనా పరిమితి ఉందా?**

**హోంమంత్రిత్వ శాఖ :** సిఎఎ సహజీకరణ చట్టాలను రద్దు చేయదు. అందువల్ల, భారతీయ పౌరుడిగా ఉండాలనుకునే ఇతర దేశాల నుండి వచ్చే ముస్లిం వలసదారులతో సహా ఎవరైనా ప్రస్తుత చట్టాల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ చట్టం, ఆ మూడు ఇస్లామిక్ దేశాల్లో తమ ఇస్లాం సంస్కరణలను అనుసరిస్తున్నందువల్ల వేధింపులకు గురవుతున్న ఏ ముస్లింను, ప్రస్తుత చట్టాల ప్రకారం భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేయకుండా నిరోధించదు.

**వాస్తవం :** ఈ సమాధానంలో, కేంద్ర హోంమంత్రిత్వశాఖ పిల్లిని సంచిలో నుండి బయటకు పంపింది. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ఇస్లాం మతంలో సంస్కరణలను పాటించినందుకు హింసించబడుతున్న ముస్లిములు ఉన్నారని వారికి బాగా తెలుసు. కానీ వారు చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా భారతదేశంలోకి ప్రవేశించినా లేదా వారి వీసా గడువు దాటితే, వారు స్వయంచాలకంగా అక్రమ వలసదారులుగా వర్గీకరించబడతారు. ప్రస్తుత చట్టాల ప్రకారం భారతీయ పౌరసత్వానికి అనర్హులు. కాబట్టి వారు ప్రస్తుత చట్టాల ప్రకారం భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేయలేరు.

# పౌరసత్వానికి మతం కొలబద్ద కారాదు


ఇందిరా జైసింగ్

**సిఎఎ నియమాలు సమానత్వానికి, భారత రాజ్యాంగానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. హింసించబడిన వ్యక్తులను రక్షించే విధానం స్వాగతించదగినది అయినప్పటికీ, వారు ఏ మతానికి చెందిన వారైనా వారందరికీ శరణార్థుల హోదా కల్పించడమే దీనికి పరిష్కారం.**

గౌహతిలో, పౌరసత్వ (సవరణ) చట్టం అమలుకు సంబంధించిన నిబంధనలను కేంద్ర హోం మంత్రిత్వశాఖ నోటిఫై చేసిన మరుసటి రోజే రాష్ట్ర వ్యాపితంగా వివిధ యూనివర్సిటీలు, కళాశాలల విద్యార్థులు సిఎఎకు వ్యతిరేకంగా నిరసన ఉద్యమం చేపట్టారు. ఈ సారి తమకు 400 మంది ఎంపిల బలం ఇస్తే, రాజ్యాంగాన్నే మార్చేస్తామని అధికార పార్టీతోను, పభుత్వంతోను సంబంధం ఉన్న కొందరు ప్రకటించగా, మరికొందరు ఖండించారు. ఈ ఎజెండాతో సంబంధం లేకుండా, పౌరసత్వ సవరణ చట్టం-2019ను ఎన్నికలకు ముందు నాటకీయంగా ప్రకటించారు. ఇది భారత రాజ్యాంగబద్ధమైన లౌకికవాదాన్ని అణగదొక్కడమే. పౌరసత్వ (సవరణ) చట్టం, 2019 అమలులోకి వచ్చిన నాలుగేళ్ల తరువాత, లోక్‌సభ ఎన్నికల ప్రకటన వెలువడనున్న తరుణంలో పౌరసత్వ సవరణ చట్టం అమలుకు నిబంధనలను కేంద్ర ప్రభుత్వం మార్చి 11న నోటిఫై చేసింది.

పౌరసత్వ (సవరణ) నిబంధనలు దేశంలో పలు చోట్ల నిరసనలకు దారితీశాయి. సిఎఎ కు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఈ నిబంధనల అమలుపై స్టే విధించాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. ఒకసారి పౌరసత్వం మంజూరు చేసిన తర్వాత యథాతథ స్థితిని పునరుద్ధరించడం కష్టం కాబట్టి చట్టం అమలును నిలిపివేయడం విజ్ఞత అనిపించుకుంటుంది. పౌరసత్వం, అన్నిటికంటే ముఖ్యమైనది. ఇది హక్కులను కలిగి ఉండే హక్కు. ఓటు హక్కుతో సహా అన్నిటికీ ఇదే ప్రాతిపాదికగా ఉంటుంది.

సిఎఎ 2019 డిసెంబర్ 31 ప్రకారం 2014కి ముందు భారతదేశంలోకి ప్రవేశించిన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ నుండి హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్శీ, క్రైస్తవ 'అక్రమ వలసదారులకు' పౌరసత్వం మంజూరు చేస్తుంది. ఈ చట్టం ముస్లిములను దాని పరిధి నుండి మినహాయించింది. కేవలం వారి మతం ఆధారంగా వారి పట్ల వివక్ష చూపుతుంది. బాధితులైన వారికి ఫాస్ట్ ట్రాక్ పౌరసత్వం ఇవ్వడంపై ఈ చట్టం ఆధారపడి ఉందని ప్రభుత్వం పబ్లిక్ డొమైన్‌లో ఘనంగా ప్రకటించింది.. అయితే చట్టం లేదా నిబంధనల్లో హింసకు సంబంధించిన ప్రస్తావన లేదు.

నోటిఫై చేయబడిన నిబంధనలు దరఖాస్తుదారు ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ లేదా పాకిస్తాన్ జాతీయుడని నిరూపించడానికి దరఖాస్తుతోపాటు సమర్పించగల మొత్తం తొమ్మిది పత్రాలను జతచేయాలని చెబుతోంది. ఈ దేశాల నుంచి వచ్చిన శరణార్థులు అక్కడ హింసకు, వేధింపులకు గురైనట్లు నిరూపించాల్సిన అవసరం లేదు. షెడ్యూల్ 1-ఎలోని ఎంట్రీ 5 ఇలా చెబుతోంది, "ఆఫ్ఘనిస్తాన్ లేదా బంగ్లాదేశ్ లేదా పాకిస్తాన్ ప్రభుత్వం లేదా ఈ దేశాల్లోని ఏదైనా ఇతర ప్రభుత్వ అధికారులు లేదా ప్రభుత్వ సంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రం వుంటే జాతీయతను నిరూపించడానికి సరిపోతుంది."

**పండగ ఆఫర్**

దరఖాస్తుదారు డిసెంబర్ 31, 2014న లేదా అంతకుముందు భారతదేశంలోకి ప్రవేశించారని నిరూపించడానికి షెడ్యూల్ 1-బి మొత్తం 20 పత్రాలను జాబితా చేస్తుంది. దావాను నిరూపించడానికి వీటిలో ఏదైనా ఒకటి సరిపోతుంది. వీటిలో వీసా కాపీ, భారతదేశానికి వచ్చినప్పుడు ఇమ్మిగ్రేషన్ స్టాంప్ కలిగి ఉండడం కూడా ఒకటి. భారతదేశంలో ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఎఫ్‌ఆర్‌ఆర్‌ఒ) లేదా ఫారినర్స్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఎఫ్‌ఆర్‌ఒ) జారీ చేసిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లేదా రెసిడెన్షియల్ పర్మిట్; భారతదేశంలో సెన్సస్ ఎన్యుమరేటర్లు జారీ చేసిన స్లిప్; భారతదేశంలో ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్ లేదా సర్టిఫికెట్ లేదా పర్మిట్ (డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు మొదలైన వాటితో సహా) భారతదేశంలో జారీ చేయబడిన రేషన్ కార్డు; అధికారిక ముద్రతో దరఖాస్తుదారునికి ప్రభుత్వం లేదా కోర్టు జారీ చేసిన ఏదైనా లేఖ, భారతదేశంలో జారీ చేయబడిన జనన ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ పత్రం మొదలైనవి. జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సి) సిద్ధమైనప్పుడు, భారతీయ పౌరులుగా చెప్పుకునే వ్యక్తుల కోసం, నివాస రుజువు కోసం అదే ఉదారవాద విధానం అమలు చేస్తారా?

హింసను ఊహించడం, మూలం యొక్క రుజువును సరళీకరించడం కాకుండా, సమాఖ్య నిర్మాణం కేంద్రీకృతమై ఉంది. ఈ నిబంధనలకు ముందు, పౌరసత్వం కోరుతూ సంబంధిత జిల్లా కలెక్టరుకు దరఖాస్తు చేయాలి. ఇప్పుడు, సిఎఎ ప్రయోజనం కోరుకునే వారి దరఖాస్తును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సాధికార కమిటీకి సమర్పించాలి.

చట్టం ముందు అందరూ సమానులేనని చెబుతున్న ఆర్టికల్ 14ను ఇది ఉల్లంఘిస్తోంది. ఆర్టికల్ 14 కేవలం పౌరులకే కాకుండా ప్రజలందరికీ వర్తిస్తుందని గుర్తుచేసుకోవాలి. అదే విధంగా ఉంచబడిన ముస్లిములకు రిజిస్ట్రేషన్ లేదా పౌరసత్వం ద్వారా ఫాస్ట్-ట్రాక్ పౌరసత్వం పేరుతో సమానత్వ హక్కును సిఎఎ తిరస్కరించింది. ఇది చట్టంలో పేర్కొన్న వ్యక్తులు కాకుండా ఇతర దేశాల వ్యక్తులను కూడా పరిగణనలోకి తీసుకోదు. ఈ మూడు దేశాల్లో హింసకు గురవుతున్న మైనారిటీలకు పౌరసత్వం ప్రయోజనాలను అందించడం - సిఎఎ ప్రత్యక్ష లక్ష్యం. హిందువులకు అనుకూలంగా ఉండటానికి ఒక ముసుగు తప్ప మరేమీ కాదు. ఎందుకంటే ఆ దేశాల్లో, వివిధ తరగతులకు చెందిన ముస్లిములు కూడా హింసించబడుతున్నారనేది అందరికీ తెలిసిన విషయమే. మెజారిటీ కమ్యూనిటీ రాజకీయాల ప్రధాన స్రవంతి నుంచి విభేదించే వారి సొంత సభ్యులను హింసించదని ఎటువంటి గ్యారంటీ లేదు. పాకిస్తాన్‌లోని అహ్మదీయ ముస్లిములు అత్యధికంగా హింసించబడుతున్న మైనారిటీలలో ఒకరని అందరికీ తెలిసిందే. మయన్మార్, శ్రీలంక వంటి పొరుగు దేశాల్లో హింసకు గురైన మైనారిటీలకు సిఎఎ 2019 ఫాస్ట్‌ట్రాక్ పౌరసత్వం ప్రయోజనాన్ని అందించదని, ఇక్కడ రోహింగ్యాలు, తమిళులు వరుసగా మైనారిటీలను హింసించారని మరికొందరు ఎత్తిచూపారు.

హింసకు గురైన వ్యక్తులను రక్షించే విధానం స్వాగతించదగినది అయినప్పటికీ, వారు ఏ మతానికి చెందిన వారైనా, వారందరికీ శరణార్థుల హోదాను మంజూరు చేయడం దీనికి పరిష్కారం. వేధింపులకు గురవుతున్న వారి పట్ల తన నిబద్ధతను ప్రదర్శించడానికి, తన సొంత మైనారిటీలను హింసించడాన్ని ఆపడానికి భారతదేశం 1961 శరణార్థుల స్థితికి సంబంధించిన జెనీవా ఒప్పందంపై సంతకం చేయాలి. ఇది విఫలమైతే, సిఎఎ హిందూ మత రాజ్యాన్ని స్థాపించే ప్రాజెక్టుగా పరిగణించబడుతుంది.

**(రచయిత్రి మాజీ అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా)**


అస్సాంలో సిఎఎ నిరసనకారుల కాగడా ప్రదర్శన


కేరళలో సిఎఎ నిరసన ర్యాలీ

# దూరదృష్టి లేనిచట్టం

## కేంద్ర ఇంధన శాఖ మాజీ కార్యదర్శి, ఇఎఎస్ శర్మ


ఇఎఎస్ శర్మ

**'అమెరికా, జర్మనీ, యూరప్, ఆస్ట్రేలియాలో కూడా భారతీయులు అనేక మంది ఉన్నారు. కేవలం ముస్లిం దేశాలు కాబట్టే పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల గురించి కేంద్ర పాలకులు పదేపదే మనదేశంలో ప్రస్తావన తెస్తున్నారు. వాస్తవానికి బంగ్లాదేశ్‌తో మనకు మంచి సంబంధాలున్నాయి. సిఎఎ వంటి అనాలోచిత చట్టం వల్ల ఇప్పటికే తేడా వచ్చేసింది.**

'పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలు చేయాలని చూడడం మోడీ 2024 ఎన్నికల అజెండా


అన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది.. కనీసం దూరదృష్టి లేని కేంద్రంలోని బిజెపి విధానంతో దేశం పరువు ప్రపంచ దేశాల్లో పలుచన కానుంది. 2019లో చట్టం చేసి 5ఏళ్లలో ఏమీ చేయలేదు. ఎన్నికలలో ఓట్ల కోసం ఇప్పుడు చేస్తున్నారు' అని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేసిన మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ అన్నారు. ప్రజాశక్తి బ్యూరోచీఫ్‌తో ఆయన సిఎఎ గురించి మాట్లాడారు. ఆ వివరాలు క్లుప్తంగా ఆయన

'అమెరికా, జర్మనీ, యూరప్, ఆస్ట్రేలియాలో కూడా భారతీయులు అనేక మంది ఉన్నారు. కేవలం ముస్లిం దేశాలు కాబట్టే పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల గురించి కేంద్ర పాలకులు పదేపదే మనదేశంలో ప్రస్తావన తెస్తున్నారు. వాస్తవానికి బంగ్లాదేశ్‌తో మనకు మంచి సంబంధాలున్నాయి. సిఎఎ వంటి అనాలోచిత చట్టం వల్ల ఇప్పటికే తేడా వచ్చేసింది. మనదేశంలో ఆవులను స్మగ్లింగ్ చేస్తున్నారని దళితులు, ముస్లింలను చంపేయడం లేదా? కానీ ప్రపంచంలో పశుమాంసం అమ్మేదాంట్లో రెండో దేశం మనది. ఈ వ్యాపారాలు ఎవరు చేస్తున్నట్లు? కేంద్రానికి ద్వంద్వ ప్రమాణాలు కావా? మన దేశంలో నిరుద్యోగం అత్యంత ప్రమాదకర స్థాయిలో సీరియస్‌గా ఉంది. దీని గురించి మోడీకి పట్టడం లేదు.వారికి కలలో కూడా ఆదానీ, అంబానీ, ఎన్నికలు తప్ప మరొకటి కనబడడం లేదు. ఇది దేశానికి అత్యంత దురదృష్టకరం. పాకిస్తాన్ నుంచి వచ్చేవాళ్లకి సిటిజెన్ షిప్ ఇస్తానంటూ మోడీ చెబుతున్నారు. ఇలా ద్వారాలు తెరిస్తే లక్షల మంది వచ్చిపడతారు. ఏం సదుపాయాలు ఇవ్వగలరు. ఇక్కడ ఉన్నవారికే తినడానికి తిండి, చేద్దామన్నా ఉపాధీ లేదు. ఇలాగే 1960లో బంగ్లాదేశ్ నుంచి హిందువులు మన దేశానికి వచ్చారు. నేను సబ్ కలెక్టర్ గాఆదిలాబాద్‌లో ఉండేవాడ్ని. దీనివల్ల స్థానిక గిరిజనులకు ఉపాధి సమస్య పెద్ద ఎత్తున ఏర్పడింది. వీరంతా చెట్లను కొట్టేసి ట్రైబల్స్‌కి అన్యాయం చేశారు. స్థానిక ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. 'పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లో మనవాళ్లను వాళ్లు అణగదొక్కుతున్నారు మనం ఉద్ధరించేయాలి'అని మోడీ అంటున్నాడు అందరూ వచ్చేస్తే భూమి ఎక్కడిది? మన దగ్గర? ఇప్పటికే మనదేశం నుంచి ఉద్యోగాలు లేనివాళ్లందరినీ ఇజ్రాయెల్ పంపుతున్నాం. అదే విధంగా కొంతమంది దుబాయ్, ఖతర్ వెళ్తున్నారు. ఆ దేశాల్లో ఏం జరుగుతోంది. మన వాళ్ల పాస్‌పోర్టులను సీజ్ చేసేస్తున్నారు. అలాగే సౌదీ అరేబియాలోకి మహిళలు అనంతపురం నుంచి వెళ్తున్నారు. వ్యభిచార ఉచ్చులో దించేసి పాస్‌పోర్టులు ఇవ్వడం లేదు. వీరందరి సంగతి ఎందుకు పట్టించుకోవడం లేదు? పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చేవారికోసం సిఎఎ అని చెప్పే మోడీ శ్రీలంకలో తమిళయన్లను చంపేశారు వారినెందుకు ఇక్కడకు రప్పించడం లేదు. ఆఫ్ఘనిస్తాన్‌లో ముస్లింలకు ఏమీ లేదు. మహిళలను ఇబ్బంది పెడుతున్నారు? వీరికెందుకు పౌరసత్వం ఇవ్వరు?టిబెట్‌లో బుద్ధిస్టులున్నారు వారికిస్తారా? దలైలామాకి అప్పట్లో ఇచ్చాము.. వీరికిస్తే తప్పేమిటి? అస్సాంలో ఇక్కడ ముస్లింలకు, బయట నుంచి వచ్చేవారికి పోలికల్లో పెద్ద తేడా ఉండదు. కొన్నాళ్ల క్రితం ఒక ముస్లిం జంటను పోలీసులు అరెస్టు చేసి విదేశీయులను ముద్ర వేసి రెండేళ్ల పాటు జైలులో పెట్టేశారు.

ఈ అంశం మీడియాలో రావడంతో నేను చూశాను. నేషనల్ హ్యూమన్ కమిషన్‌కి ఫిర్యాదు రాశాను. తర్వాత అస్సాంలోనే ఒక ఎన్‌జిఒ సంస్థ వెళ్లి వారిని విడిపించింది. అప్పటికే వారి పిల్లల భవిష్యత్ పోయింది. కుటుంబానికి ఎలాంటి నష్టపరిహారం లేదు. రెండేళ్ల పాటు జైలులో పడ్డ వారి మానసిక క్షోభకు ఎలాంటి పరిహారం లేదు. జాతీయ మానవ హక్కుల సంఘం వారు నేనే పంపిన పిటిషన్‌ను ఆరు నెలలు వారి వద్ద ఫిర్యాదు ఉంచుకుని అస్సాం మానవహక్కుల సంఘానికి పంపించారు. అస్సాం రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ వారు వారి అరెస్టు, కేసులకు సంబంధించి నన్ను సాక్ష్యాలు అడిగారు. అస్సోంలో జరిగిన దానికి నేను ఎలా ఆధారాలు ఇవ్వగలను? 'మీ దగ్గరే ఉన్నాయి చూసుకోండి ' అని జవాబిచ్చాను.ఇలా అస్సాంలో వేలాది కేసులకు అతీగతి ఉండడం లేదు. కేంద్రం అత్యంత వినాశకర సిఎఎ తెచ్చి ముస్లిం కుటుంబాలను ఇతర మైనారిటీ, దిగువ శ్రేణి తరగతులను అవస్థల పాలు చేయడంతో పాటు,ఎన్నికల్లో లబ్ధిపొందాలని ప్రయత్నాలు చేస్తోంది.

## నా పేరు రాసుకో, నేను భారతీయుడిని

-అజ్మల్ ఖాన్
(పాలస్తీనా గురించి మహమూద్ దర్వేష్, కశ్మీర్ గురించి ఆగా షాహిద్ అలీ, అస్సాం గురించి మియా కవులు రాసిన కవితలను అనుసరించి)



రాసుకో నా పేరు
నేనొక భారతీయుణ్ని
రాసుకో రాసుకో
నా పేరు అజ్మల్
నేనొక ముస్లిమ్‌ను
భారతీయ పౌరుణ్ని
మా ఇంట్లో ఉన్న ఏడుగురమూ
పుట్టుకతో భారతీయులమే
ధ్రువీకరించే పత్రాలు కావాలా?
నా పేరు రాసుకో
భారతీయుడినని రాసుకో
నేనొక మోప్లాను
నా పూర్వీకులు అస్పృశ్యులు
నీ భాషలో చెప్పాలంటే హిందువులు
శతాబ్దాల కింద మనువును చెంపదెబ్బ కొట్టి
గౌరవం పొంది
పేర్లు మార్చుకున్నవాళ్లు
అదంతా మీ సిద్ధాంతకర్తల ముత్తాతలు
పుట్టక ముందరి ముచ్చట
నీకేమన్నా అనుమానమా?
రాసుకో నా పేరు
నేను భారతీయుడిని

నా తాత ముత్తాతలు
ఈ నేల దున్నారు
వాళ్లీ మట్టిలో పుట్టి పెరిగి
ఈ మట్టిలో కలిసిపోయారు
వాళ్ల వేళ్లు
ఈ మర్రిచెట్ల వేళ్లకన్న
కొబ్బరిచెట్ల వేళ్లకన్న
లోతుగా పరచుకున్నాయి
వాళ్లు భూస్వాములు కాదు
రైతులు మాత్రమే
కాని ఈభూమే వాళ్ల వేరు
వాళ్ల వాసనే
ఈ నేల సుగంధం
వాళ్ల చర్మపు వర్ణమే
ఈ నేల రంగు
ధ్రువీకరణ పత్రాలు కావాలా?
రాసుకో నా పేరు
నేను భారతీయుడిని

ఇంకా ధ్రువీకరణ పత్రాలు
కావాలంటావా?
మరి నేను మలబార్ లోనూ
ఇతరచోట్లా
సమాధులన్నీ తవ్వవలసిందే
మా తాత ముత్తాతలు
బ్రిటిష్ తుపాకి గుళ్లకు
ఒరిగిపోయినప్పుడు
వాళ్ల చాతీల మీద
మిగిలిన బూట్ల తన్నులూ
తూటాల గాయాలూ
చూపుతాను

అయినా
పత్రాలు కావాలంటావా?
నీదగ్గర ఉన్న
పత్రాలేమిటో
నాకు తెలుసు
సెల్యులార్ జైలులో
లొంగుబాటు లేఖ
నీ చేతులకు
అంటిన గాంధీజీ నెత్తుటి మరకలు
ఇంకా నీ పత్రాలు
గుర్తు చెయ్యమంటావా?
నువ్వింకా నా పత్రాలు అడిగితే
నోరు మూసుకుని
దొబ్బెయ్యమంటాను
రాసుకో నా పేరు
నేను భారతీయుడిని

గుర్తు పెట్టుకో
నువ్వు మసీదు
కూలగొట్టడానికి
జనాన్ని తోలావని
నేను మరిచిపోలేదు
ఇప్పుడు నువ్వు
రాజ్యాంగాన్ని
కూలగొట్టావుజి
ఈ నేల ఆత్మను
కూలగొట్టావు

నేను మండిపోతున్నాను
ఎంత ధైర్యం నీకు?
ఎంత ధైర్యం నీకు?
రాసుకో నా పేరు
నేను భారతీయుడిని
ఇది నాదైన నేల
నేనిక్కడే పుట్టాను
ఇక్కడే గిడతాను
అందువల్ల
నీ ఎన్ ఆర్ సి మీద
అన్నిటికన్న పైన
స్పష్టంగా
పెద్దక్షరాలతో
ముద్దక్షరాలతో

రాసుకో నేను
భారతీయుడినని

(అనువాదం : ఎన్ వేణుగోపాల్)

## కాలక్రమణిక

**2019**

- డిసెంబరు11: పౌరసత్వ చట్ట సవరణ బిల్లు-2019 ప్రతిపక్షాల బహిష్కరణమధ్య పార్లమెంటు ఆమోదం పొందింది
- డిసెంబరు13: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సిఎఎకు ఆమోదం తెలిపారు. దీనిపై దేశవ్యాపితంగా నిరసనలు పెల్లుబికాయి.
- డిసెంబరు 15: ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో మహిళలు పెద్దయెత్తున నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు

**2020 జనవరి 30**

సిఎఎకు వ్యతిరేకంగా జామియా మిలియా ఇస్లామియాలో శాంతియుతంగా నిరసనతెలుపుతున్నవారిపై ఓ సాయుధ దుండగుడు కాల్పులు జరిపాడు.

- ఫిబ్రవరి: పలు రాష్ట్రాల్లో సిఎఎ వ్యతిరేక ఆందోళనలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి.
  ఢిల్లీలో మైనార్టీ ముస్లింల ఇళ్లపై దాడులు, అల్లర్లు చోటు చేసుకున్నాయి.
- 2024 జనవరి 29: కేంద్ర మంత్రి శంతను ఠాకూర్ బెంగాల్‌లో ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ, సిఎఎ వారం రోజుల్లో అమలులోకి వస్తుందని చెప్పారు.
- ఫిబ్రవరి 10: లోక్‌సభ ఎన్నికలకు ముందే సిఎఎ అమలుకు నిబంధనలు నోటిఫై చేస్తామని హోం మంత్రి అమిత్‌షా చెప్పారు.
- మార్చి 11: సిఎఎ నిబంధనలు నోటిఫై చేశారు.

### పౌరసత్వం నిరాకరిస్తే ఏం జరుగుతుంది?

- మతం పేరుతో వేధింపులు పెరిగే ప్రమాదముంది
- దేశం నుంచి వెళ్లగొట్టబడతారు
- వారికి ఎలాంటి ఓటింగ్ హక్కులు ఉండవు
- వారికి ఎలాంటి సంక్షేమ పథకాలు వర్తించవు. ఆధార్, పాన్ కార్డులు వంటివి నిరాకరిస్తారు.
- రాజ్యాంగం కల్పించే ప్రాథమిక హక్కులు వారికి నిరాకరించబడతాయి.

## పౌరసత్వం

పౌరుషత్వమే- నా
పౌరసత్వము
పోరు తత్వమే- నా
వారసత్వము!
ఉరికంబం ముద్దాడిన
భగత్ సింగునడిగావా?
జలియన్వాలాబాగ్‌లో
గోడల తడినడిగావా?
గాడ్సే కాల్చిన తుపాకీ
గాలినైనా చూశావా?
గాంధేయ పరిభాషలో
వీలునామా రాశావా?
పౌరుషత్వమే- నా
పౌరసత్వము!
అత్తరా! నెత్తురా!?
అది కుంకుమ కాశ్మీరా!
కలలో నుంచి జారుతున్న
మా వెన్నెల కన్నీరా?
బ్రహ్మపుత్రులం మేమని
ఏ అమ్మని అడగాలి?
తేయాకు నీళ్లతో
ఏ కాళ్లను కడగాలి?
పౌరుషత్వమే
నా పౌరసత్వము!
ఎవరు నా మంత్రసాని?
ఎవ్వరు నా పురిటి జ్ఞాని?
ఏదీ నా గర్భ ఘోష?
ఏది నా కంటి భాష?
వినిపించ లేదా నా
రక్తపు ప్రసవ శ్వాస?
గుండె చీల్చి మువ్వన్నెల
జండా చూపించాలా!?

- నల్లి ధర్మారావు,
సెల్ : 7660967313

## దేశ పౌరులేనా?


'భారతదేశం నా మాతృభూమి..
భారతీయులందరూ నా సహోదరులు'
అన్న ప్రతిజ్ఞ నా బాల్యపు జ్ఞాపకం.
ఆ ప్రతిజ్ఞకే ఇప్పుడు పరీక్ష..
ఏకత్వాన్ని, భిన్నత్వానికి ప్రశ్న..
మనిషి ఉనికికి రుజువులా?
ఇప్పుడు నువ్వు రుజువు చేసుకోవాలి.
లేకపోతే.. నువ్వు పరాయివే..

అందుకే.. ఆదిలోనే ఈ ఆలోచన అడ్డుకోవాలి..
లేకపోతే.. నిజంగానే 'అడ్రసు' కోసం అల్లాడతాం.
ఎన్నికల ముందు ఈ ప్రశ్నల రొద..
నీకూ ఇలాంటి ప్రశ్న ఎదురవ్వొచ్చు!
'మీరు దేశ పౌరులేనా?'

అందుకే.. మార్పు వైపు మారాలి మనం..
అత్యంత వివాదాస్పదమైనదీ పౌరసత్వం..
పెద్దనోట్ల రద్దు.. అతి పెద్ద వైఫల్యం..
భావోద్వేగాల లబ్ధి దాని ఆనవాయితీ..
ఆర్భాటపు అచ్చేదిన్ చచ్చేదిన్ ఇప్పుడు..
ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు..
వట్టిపోయిన వాగ్దానం..
ఆర్థికమాంద్యం అతలాకుతలం
డాంబికాలన్నీ ఒక్కొక్కటీ రాలిపోయి..
నిలదీసే తరుణం తెరపైకి..
దృష్టి మళ్లించే నాటకం ఆడుతోంది..

పౌరసత్వ పరీక్షలు పెడుతోంది.
అందుకే.. ఉద్యమాలు ఉవ్వెత్తున మళ్లీ
కొనసాగాలి.
నా దేశంలో నేను నిరూపించుకోవటం ఏమిటి?
"నేను ఈ దేశ పౌరుణ్ణి..!"
ఇదే ఇప్పుడు ప్రతి ఒక్కరి నినాదం కావాలి..
ఒక్కటై ఎదిరించాలి.
మార్పు సాధించేదాకా ప్రభంజనమై సాగాలి.

శాంతిశ్రీ
8333818985




## విషనాగు

సిఎఎ ఒక చట్టం కాదు
తన పిల్లలను తానే
మింగేసే విషనాగు!
తన పౌరులను
విడ దీసేది
వేరు చేసేది
వివక్ష చూపేది
విభజన గీసేది
అది పాలనా
అది చట్టమా
అది రాజ్యమా
అది ప్రభుత్వమా
పాము తన పిల్లలను
తానే తినే పాషాణ
చట్టమిది

పసి వాళ్ళ
కళ్ళు పీకి
కాళ్ళు నరికి
చేతులు విరిచి
అంగవికలుర చేసి
వారిచే బిచ్చమెత్తించి
సంపదలు పోగేసుకుని
భోగలాలసత
అనుభవించే
గజదొంగల ముఠా
తెచ్చిన చట్టమిది

తుచ్ఛులు
నీచులు
వ్యభిచారులు
పుండాకోరులు
పాపాత్ములు
పరాన్నజీవులు
కుత్సిత బుద్ధులు
అడ్డ దారిన
దొడ్డి దారిన
అధికారం
హస్తగతం చేసుకొన్న
అధికార మదాంధులు
దేశ ప్రజల ఐకమత్యంపై
దేశ ప్రజల ప్రశాంత
జీవనంపై
వేయి పడగల నీడ ఈ
చట్టం
కూడ బెట్టుకున్న
పాడికుండలో
కర్కశంగా కక్కిన విషపు
చుక్కే చట్టం

రత్నారావు

## వివక్ష చూపడమే



పౌరసత్వానికి ముస్లిములను మినహాయించడం వివక్ష చూపడమే. ఒక మతాన్ని పూర్తిగా తక్కువ చేసి చూడడం ద్వారా మిగిలినవారి మన్ననలు పొందాలని చూడడం బిజెపికి కొత్త కాదు. ఈ విషయం ప్రజాస్వామ్యవాదులు, మేధావులు గమనిస్తునే ఉన్నారు. అయినా, అడ్డదారుల్లో బిజెపి గెలిచి అధికారం చెలాయిస్తోంది. ఇది ఎల్లకాలమూ సాగదు. ఇటువంటి పార్టీతో మన రాష్ట్రంలోని ఇతర పార్టీలు జతకట్టడం దురదృష్టకరం. ఇటువంటి పొత్తులు ఏ రాజకీయ పార్టీనైనా ప్రజల నుంచి దూరం చేస్తాయి.

**-మహ్మద్ హబీబ్,
జమాతే ఇస్లామీ హింద్, విజయనగరం పట్టణ అధ్యక్షులు**

## రాజ్యాంగ మౌలిక సూత్రాలపై దాడి

**మొదటిపేజీ తరువాయి**

పత్రాలు లేకపోయినా.. పౌరసత్వం ఇవ్వవచ్చని సిఎఎ చట్టం చెబుతోంది. అంటే 2014 డిసెంబర్ 31కి ముందు భారత్‌కు వచ్చి ఉన్న వారికి పౌరసత్వాన్ని కోరుకునేందుకు అవకాశం ఉంది. వారు అర్హులు అవుతున్నారు. మరొక వివరణ ఇది.. సిఎఎ కింద హిందువులు, క్రిష్టియన్లు, బౌద్ధులు, పార్శీలకు పౌరసత్వం లభిస్తుంది. అంటే ప్రత్యేకంగా ముస్లీంలకు మాత్రమే అవకాశం లేదని స్పష్టం చేస్తోంది. 2014 తర్వాత ప్రవేశించడానికి వీలు లేదని మరింత స్పష్టం చేస్తోంది. ముస్లీంలను మాత్రమే ఎందుకు పక్కన పెట్టారు..? కేవలం ముస్లీం మతం ఆధారంగా భారత్‌కు రాకూడదని చెప్పడం న్యాయమ..? ధర్మమా..? రాజ్యాంగ సమ్మతమా..?1950 నాటి రాజ్యాంగం, 1955 నాటి పౌరసత్వ చట్టం ఉన్న నియమాలకు వ్యతిరేకంగా 2019లో పౌరసత్వ చట్టాన్ని సవరించారు. ఈ సవరణ రాజ్యాంగ మౌలిక లక్షణానికి (బేసిక్ స్ట్రక్చర్), లౌకిక లక్షణాలకు, మతాతీతమైన లక్షణానికి వ్యతిరేకమని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రూల్స్ అమలు చేసేటప్పుడు పూర్తి అధికారాలు ప్రభుత్వ గుప్పిట్లోకి వెళ్తాయి. పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అర్హతలను నిర్ణయించే అధికారాన్ని పోస్టల్ అధికారులకు అప్పగించారు. వారికి సాయుధ బలగాలు అండగా ఉంటాయి.

**అధికార దుర్వినియోగ భయాలు..**

నిజానికి పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) ప్రభావం ఈశాన్య రాష్ట్రాలపై తీవ్రంగా ఉంటుంది. అసోం, మేఘాలయా, త్రిపుర రాష్ట్రాల ప్రజలు ఆందోళన పడుతున్నారు. ఎందుకంటే అక్కడికి వలస వచ్చిన వారు తమ సంస్కృతిని, సంప్రదాయాన్ని కోల్పోతామని భయపడుతున్నారు. మనకు రాజ్యాంగంలో ఆరో షెడ్యూల్ అని ఒకటి ఉంది. భారత దేశంలో దాదాపు 40 శాతం గిరిజన ప్రాంతాలు ఆరో షెడ్యూల్‌లోకి వస్తాయి. కనుక కేంద్ర ప్రభుత్వం అరుణచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, మేఘాలయలోని అన్ని ప్రాంతాలు, అసోం, త్రిపురలోని మరికొన్ని ప్రాంతాలను సిఎఎలో మినహాయిస్తారు. అది గొప్ప విషయం. కానీ.. దీన్ని ఏ విధంగా అమలు చేస్తారు..?. సిఎఎ అమలులో చేతికి వచ్చే అధికారం దుర్వినియోగం చేసే ప్రమాదం లేకపోలేదా..? ఇది ప్రజల భయం.

**మీరు భారతీయులేనా...?**

ఈ దేశంలో ఉండే వారు భారతీయ పౌరులా..? కాదా..? అనేది ఏ విధంగా నిర్ణయిస్తారు.?. మీరు, మీ తండ్రులు, తాతలు మీరు భారత పౌరులని ఏ విధంగా రుజువు చేయాలి." అనే ప్రశ్నలకు రూల్స్‌లో సరైన జవాబులు దొరకడం లేదు. ఇది ప్రధాన సమస్య. దీని వల్ల ఈ దేశంలో ఉన్న వారికి, వేరే దేశం నుంచి వచ్చిన వారికి భారత్‌లో పౌరసత్వం పొందాలంటే కావాల్సిన అర్హతలు, ధృవీకరణలు ఎక్కడ దొరుకుతాయి? ఉన్నట్టుండి మా తాతా భారత పౌరసత్వం కలిగిన వాడు అని రుజువు చేసుకోవడానికి అర్హతలు ఎక్కడ దొరుకుతాయి? ధ్రువీకరణాలు ఎక్కడ లభిస్తాయి? ఒకవేళ దొరకకపోతే ఇక్కడ పుట్టిన వాడు, తరతరాలుగా ఉన్నవాడు, ఓటింగ్ ఉన్న వాళ్లు కూడా, ఆధార్ ఉన్నా.. పౌరుడు కాదనే సమస్య, అనుమానం వస్తే ఏం చేయాలి..?.

**నిరాకరిస్తే ఎలా?**


ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ఏ పౌరుడికి అయినా పౌరసత్వాన్ని నిరాకరిస్తే.. ఇవ్వబోమని నిర్ణయిస్తే.. ఈ ప్రజలు ఎక్కడికి వెళ్లాలి. ఏ దేశానికి వెళ్లాలి..?. ఒకవేళ వీడు విదేశీయుడు అని నిర్ణయిస్తే.. ఆ మాజీ పౌరులు ఎక్కడికి పోవాలి..?. అరెస్ట్ చేస్తారు. జైల్లో పెడతారు.. వారు జైల్లో ఎన్నాళ్లు ఉంటారు..?. ఎవరికైనా పౌరసత్వాన్ని భారత ప్రభుత్వం నిరాకరిస్తే.. భారత రాజ్యాంగంలో ఉన్న ఏ హక్కులు దక్కవు. అప్పుడు వాళ్ల గతి ఏమిటీ..?. అసోం తరహాలో లక్షల మంది జైలు పాలు కావాల్సిందేనా..?. కనుక కొన్ని కొత్త జైల్లు నిర్మిస్తారు. ఇదా దేశ అభివృద్ధి కార్యక్రమం..?.








# ఆర్‌ఎస్‌ఎస్ అబద్ధాల ఫ్యాక్టరీ




ఒక అబద్ధాన్ని కప్పిపెట్టడానికి ప్రయత్నిస్తే అనేక అబద్ధాలు చెప్పాల్సి వస్తుంది. ప్రస్తుతం నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం తను చేస్తున్న పని వెనుక కుట్రను కప్పిపుచ్చుకోడానికి అనేకానేక అబద్ధాలు చెబుతున్నది. పౌరసత్వ సవరణ చట్టం తీసుకువచ్చాక బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ అబద్ధాల ఫ్యాక్టరీనుండి వచ్చిన అబద్ధాలు చూడండి:

**అబద్ధం నెం 1:** పౌరసత్వ చట్టం ఎవరిపట్ల వివక్ష చూపదు. భారతీయ పౌరులెవరికీ ఇబ్బంది ఉండదు.

**నిజం:** రాజ్యాంగం ముందు భారత పౌరులందరూ సమానమే అన్న మూల సూత్రానికి భిన్నంగా పౌరసత్వ చట్టం, ముస్లిం మైనార్టీపట్ల తీవ్రమైన వివక్ష చూపుతోంది. సిఎఎ-ఎన్‌ఆర్‌సి-ఎన్‌పిఆర్‌ల వల్ల భారతదేశంలోని ముస్లింలకే కాకుండా అన్ని మతాలకు చెందిన ప్రజలు ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలు ఆదివాసీలు, దళిత బలహీనవర్గాల వారు నష్టపోతారు.

**అబద్ధం నెం 2:** గతంలో హిందూ శరణార్థి ప్రజానీకానికి మద్దతిచ్చిన ప్రతిపక్ష పార్టీలు నేడు ఓటుబ్యాంకు కోసం పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాయి. బంగ్లాదేశ్ నుండి వచ్చిన మైనార్టీ మతస్తుల కోసం ఒక చట్టం చేయాలని సిపిఐ(ఎం) గతంలో డిమాండు చేసిందని ప్రధాని నరేంద్ర మోడీ డిసెంబర్ 22న చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. 2012లో జరిగిన పార్టీ 20వ మహాసభ తీర్మానాన్ని, నాటి ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ రాసిన లేఖను వారు పేర్కొంటున్నారు.

**నిజం:** వాస్తవానికి ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరించడం ద్వారా మెజారిటీ హిందువుల ఓట్లు కొల్లగొట్టే ఉద్దేశంతో బిజెపి ఈ చట్టం తెచ్చింది. బ్రిటిష్ వారు భారతదేశాన్ని విభజించడంతో బంగ్లాదేశ్ ప్రాంతం నుండి వలస వచ్చిన లక్షలాది మంది శరణార్థుల హక్కుల కోసం సిపిఐ(ఎం) అవిరళంగా కృషి చేసింది. అభాగ్యులైన ఈ శరణార్థులకు సరైన పునరావాసం కల్పించడానికి పశ్చిమ బెంగాల్‌లో కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమం ఎనలేని కృషి చేసింది. ఆ కష్టకాలంలో కమ్యూనిస్టులు ప్రజల పక్షాన నిలబడితే ఆర్‌ఎస్‌ఎస్ ప్రేక్షక పాత్ర వహించింది. కానీ సిపిఐ(ఎం) ఏనాడూ ముస్లింల పట్ల వివక్షత ప్రదర్శించే ఎటువంటి చట్టాన్నీ బలపరచలేదు. మతం పేరుతో పౌరసత్వాన్ని ఇచ్చే విధానాన్ని సిపిఐ(ఎం) తొలినుండీ వ్యతిరేకిస్తోంది.

**అబద్ధం నెం3:** పౌరసత్వ చట్టం (సిఎఎ)కీ, పౌరసత్వ రిజిస్టరు (ఎన్‌ఆర్‌సి)కీ సంబంధం లేదు. రెండూ పూర్తిగా వేరువేరు. ప్రతిపక్షాలు రెంటినీ కలపడానికి ప్రయత్నిస్తున్నాయి.

**నిజం:** రెంటికీ మధ్య స్పష్టమైన సంబంధం ఉంది. ఎన్‌ఆర్‌సి.. దేశంలో పౌరులెవరో, పౌరులు కానివారెంరో గుర్తిస్తుంది. పౌరులు కాని వారిని అక్రమ వలసదారులుగా ప్రకటిస్తారు. పౌరసత్వ చట్టం అక్రమవలసదారుల్లో ముస్లింలకు మినహా మిగిలిన మతాలవారికి పౌరసత్వం ఇస్తుంది. అప్పుడు ముస్లింలు మాత్రమే అక్రమవలసదారులుగా మిగిలిపోతారు. హోం మంత్రి అమిత్ షా 2019 డిసెంబర్ 9న పార్లమెంటులో మాట్లాడుతూ పౌరసత్వ చట్టం (సిఎఎ) తరువాత ఎన్‌ఆర్‌సిని దేశవ్యాపితంగా తీసుకువస్తాం అని చెప్పారు. సిఎఎ మీద జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ "మేము దేశవ్యాపితంగా ఎన్‌ఆర్‌సిని తెస్తాం. ఒక్క అక్రమ వలసదారుణ్ణి కూడా వదిలిపెట్టబోము" అన్నారు. అందువల్ల సిఎఎకూ ఎన్‌ఆర్‌సికీ లింకు పెట్టింది ప్రతిపక్షాలు కాదు, బిజెపి ప్రభుత్వ నాయకులే.

**అబద్ధం నెం 4:** "మా ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చింది లగాయతు ఎక్కడా కూడా ఎన్‌ఆర్‌సి మీద చర్చ జరగలేదని 130 కోట్ల మంది భారతీయులకు నేను చెప్పదలచుకున్నాను" అని ప్రధాని మోడీ డిసెంబర్ 22న ఢిల్లీలో జరిగిన ర్యాలీలో చెప్పారు.

**నిజం:** దురదృష్టమేమంటే బిజెపి అబద్ధాల ఫ్యాక్టరీకి ప్రధాన మంత్రే నాయకత్వం వహిస్తున్నారు. "అక్రమవలసదారులు ప్రవేశించే ప్రాంతాల్లో ప్రాధాన్యతా క్రమంలో జాతీయ పౌరసత్వ రిజిస్టరును అమలుపరచాలని మా ప్రభుత్వం నిర్ణయించింది.." అని 2019 జూన్ 20 పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించే విధాన పత్రాన్నే రాష్ట్రపతి చదువుతారు కదా!

# మతపరమైన విభజన కోసమే...



కెఎస్ లక్ష్మణరావు

18వ లోక్‌సభ సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ రాబోతున్న సమయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన విభజన తీసుకురావడానికి 2019లో ఆమోదం పొందిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలుకు విధివిధానాలు ప్రకటించింది. భారతదేశాన్ని మత ప్రాతిపదికన హిందూత్వ రాజ్యాంగా మార్చే కుట్రలో భాగంగా ఈ చట్టాన్ని అమలు చేయడానికి పూనుకుంది. ఇప్పటికే జమ్మూ-కశ్మీర్ 370వ ఆర్టికల్ రద్దు చేయడం, మణిపూర్‌లో హిందూ, క్రిస్టియన్ విభజన చేయడం, ఏకపౌరస్మృతి అమలు చేస్తామని ప్రకటించడం, అయోధ్య రామాలయ నిర్మాణం, మైనార్టీలు, దళితులపై దాడులు, పాఠ్యాంశాలను కాషాయీకరణ చేయడం మొదలైన చర్యల ద్వారా ప్రజలను మతపరంగా విభజించడానికి ప్రయత్నించిన బిజెపి, కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టం అమలు చేయడానికి పూనుకోవడం వెనుక హిందూత్వ ఎజెండా ఉంది.

### రాజ్యాంగం-పౌరసత్వం

ప్రపంచంలో ఏ దేశంలో అయినా పౌరసత్వం పుట్టుక ద్వారా, రక్త సంబంధం ద్వారా లభించడం సహజమైన విషయం. ఏ దేశంలో అయినా విదేశాల నుంచి వచ్చి స్థిరపడిన వారికి ఇచ్చే పౌరసత్వాన్ని సహజకృత పౌరసత్వం అంటారు. మన రాజ్యాంగంలో రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగం రెండో భాగంలో 5 నుంచి 11 వరకు ఆర్టికల్స్‌లో పౌరసత్వాన్ని గురించి పేర్కొన్నారు. పౌరసత్వాన్ని సహజంగానూ, సహజకృతంగా ఇవ్వాలని మాత్రమే రాజ్యాంగం పేర్కొంది. 14వ నిబంధన చట్టం ముందు పౌరులందరూ సమానమని, 15వ నిబంధన పౌరుల మధ్య కుల, మత, వర్గ, లింగ వివక్ష చూపరాదని చెప్పింది. దీని కోసం 1955 భారత పౌరసత్వ చట్టాన్ని చేశారు. ఇప్పుడు నరేంద్ర మోడీ ప్రభుత్వం చేసిన పౌరసత్వ సవరణ చట్టం పూర్తి రాజ్యాంగ విరుద్ధమైంది. పౌరసత్వాన్ని మతపరంగా ఇవ్వడానికి పూనుకుంది. 1955 పౌరసత్వ చట్టానికి కొన్ని సవరణలు చేసి ఈ కొత్త చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టం ప్రకారం పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లో అణచివేత వల్ల 2014కు ముందు వలస వచ్చిన ప్రజల్లో ముస్లిములకు మినహా మిగిలిన మతాల ప్రజలకు అంటే హిందువులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులకు భారతీయ పౌరసత్వం ఇస్తారు. ముస్లిం ప్రజలకు ఇవ్వరు. శ్రీలంకలో శరణార్థులు అయిన హిందువుల గురించి చట్టాల్లో ప్రస్తావించలేదు. మతపరమైన విభజన తేవడానికి ఈ చట్టం చేశారు. ఈ చట్టం దేశంలోని లౌకిక, ప్రజాస్వామ్యవాదులు, రాజ్యాంగాన్ని గౌరవించే వారిలో తీవ్ర ఆగ్రహం, ఆందోళన కలిగించింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా 2019లో దేశంలో అనేకచోట్ల పెద్దయెత్తున ఆందోళనలు జరిగాయి. చట్టాన్ని మేధావులు, కళాకారులు, రచయితలు, విద్యావేత్తలు, వేలాది మంది వ్యతిరేకించారు. అంతలో కరోనా రావడంతో చట్టం అమలు వాయిదా పడి ఇప్పుడు 2024 ఎన్నికల నేపథ్యంలో చట్టం అమలుకు విధి విధానాలు ప్రకటించారు.

### అస్సాంలో ఎన్‌ఆర్‌సి అమలు

అస్సాంలోకి 1971కు ముందు వలస వచ్చిన విదేశీయులను గుర్తించడానికి జాతీయ, పౌరపట్టిక (ఎన్‌ఆర్‌సి)ను అమలు చేయాలని అస్సామీ ప్రజల ఆందోళన ఫలితంగా సుప్రీంకోర్టు కోరింది. దీనిలో భాగంగా అస్సాంలోని 3 కోట్ల 30 లక్షల మంది జనాభా తమ పౌరసత్వం నిరూపించుకోవాల్సి వచ్చింది. రూ.1,200 కోట్లు ఖర్చు చేసి 19 లక్షల 60 వేల మందిని భారతీయ పౌరులు కారని తేల్చారు. వీరిలో 12 లక్షలకుపైగా హిందువులు ఉన్నారు. మిగతా వారు ముస్లిములు. దీంతో, అస్సామి గడ్డపై పుట్టిన మూల వాసులకే ఎన్‌ఆర్‌సిలో చోటు దక్కలేదని, పత్రాలను సమర్పించలేకపోయారని ఆందోళనలు చేస్తున్నారు. అస్సాంలోని ఎన్‌ఆర్‌సి ప్రక్రియ పెద్ద మానవ సంక్షోభాన్ని, విషాదాన్ని దేశ ప్రజలకు సృష్టించారు. అస్సాంలో ఎన్‌ఆర్‌సి సృష్టించిన పౌరసత్వ సంక్షోభాన్ని పరిష్కరించకుండానే దేశ వ్యాప్తింగా ఎన్‌ఆర్‌సి అమలుకు మోడీ ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ ఎన్‌పిఆర్‌లో కొత్తగా 70 ఏళ్లలో ఏనాడూ పౌరుల నుంచి స్వీకరించని సమాచారాన్ని మోడీ ప్రభుత్వం సేకరిస్తోంది. అదేమంటే 1950 తరువాత పుట్టిన వారు తాతముత్తాలతో సహా తమ పుట్టిన తేదీ, నివాసాన్ని తెలిపే అధికారిక పత్రాలను సమర్పించుకోవాలని చెప్తోంది. దేశంలో నివసిస్తున్న విదేశీయులు కూడా అర్హత పత్రాలు చూపించాలి. వీటి ఆధారంగా ఎన్‌ఆర్‌సి ప్రక్రియ ప్రారంభమైతే మొదటగా భారతీయులందరూ తమ పౌరసత్వం కోల్పోతారు. ఆ తరువాత పుట్టిన తేదీ, నివాసాన్ని పత్రాల ఆధారంగా నిరూపించుకోలేని కోట్లాది మంది భారతీయులు పౌరులు కాకుండా పోతారు. ఉదాహరణకు 2000వ సంవత్సరంలో పుట్టిన పిల్లల్లో 56 శాతమే రిజిస్ట్రర్ కాబడ్డారు. వీరికే ఎన్‌ఆర్‌సి అమలు చేస్తే 44 శాతం మంది పౌరసత్వం కోల్పోతారు. 1971 ముందు పుట్టిన వారి పౌరసత్వం పరిస్థితి ఏమిటి? కోట్ల మంది భారతీయులు ముఖ్యంగా ముస్లిములు, అణగారిన కులాలు, సంచార జాతులు దేశం లేని మనుషులుగా రోహింగ్యాలుగా మారడమే అవుతుంది.

### దేశాన్ని పౌరసత్వ సంక్షోభంలోకి దింపడం వెనుక?

అస్సాం రాష్ట్రంలోనే కాకుండా మొత్తం దేశాన్ని పౌరసత్వ సంక్షోభంలోకి దింపడం వెనుక హిందూత్వ ఎజెండా ఉంది. దేశంలో నివసిస్తున్న విదేశీయులను గుర్తించి పౌరసత్వానికి అర్హతలు లేని వారిని వారి స్వదేశాలకు పంపించే చట్టాలు ఇప్పటికే ఉన్నాయి. వీటిని అమలు చేయకుండా సిఎఎ, ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఆర్‌లను ముందు తెచ్చారు. ఎన్‌ఆర్‌సిలో అస్సాంలో పౌరసత్వాన్ని కోల్పోయిన 12 లక్షల మంది హిందువులకు సిఎఎ ద్వారా పౌరసత్వం ఇచ్చి వారి ఓట్లను పొందుతారు. ఆరు లక్షలకుపైగా ఉన్న ముస్లిములు మతం కారణంగా పౌరసత్వం కోల్పోయి నిర్బంధ శిబిరాలకు (డిటెన్షన్ సెంటర్‌లకు) తరలించబడతారు. దేశవ్యాప్తంగా అమలయ్యే ఎన్‌ఆర్‌సి వల్ల కోట్లాది మంది భారతీయులు పౌరసత్వం కోల్పోతారు. హిందువులకు, ఇతర మతస్తులకు సిఎఎ ద్వారా మోడీ ప్రభుత్వం పౌరసత్వాన్ని ఇస్తామంటోంది. పౌరసత్వం నిరూపించుకోలేకపోయిన కోట్లాది మంది భారతీయుల మూలాలు కలిగిన ముస్లిములకు మాత్రం వారి మతం కారణంగా పౌరసత్వం నిరాకరించబడి డిటెన్షన్ క్యాంపులకు తరలించబడతారు. వీరిని దేశ భద్రతకు ముప్పు కలిగిస్తున్న ముస్లిం చొరబాటుదారులుగా ముద్రవేస్తారు. ఈ విధంగా నియంతృత్వంగా దేశ పౌరులపై మోడీ ఎందుకు పౌరసత్వ యుద్ధం ప్రకటించారు? ఇదంతా హిందువుల్లో బూటకపు దేశ భద్రత భరోసా నింపి పౌరులను హిందూ, ముస్లిములుగా విభజించి ఓట్ల లబ్ధి పొందడానికి తప్ప, దేశ ప్రయోజనాల కోసం కాదు.

### దేశ వ్యాప్త ఆందోళన

పౌరసత్వ సవరణ చట్టం-2019ని మోడీ ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకోవడంతో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీ, డిఎంకె, సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, టిఎంసి తదితర పార్టీలన్నీ ఆందోళన వెలిబుచ్చాయి. ఈ చట్టం అమలు చేయడానికి వీల్లేదని ప్రకటించాయి. లౌకిక విధానాన్ని బలపర్చే మేధావులు, విద్యావంతులు, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు తదితరులంతా సిఎఎ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారు. దేశాన్ని హిందూత్వం వైపు తీసుకెళ్లడానికే ఈ ప్రయత్నాలు చేస్తున్నారని, జాతీయ సమైక్యతకు భంగం ఏర్పడుతుందని వారు ప్రకటించారు. దేశవ్యాప్తంగా అనేక చోట్ల ఆందోళనలు జరుగుతున్నాయి.

### మన రాష్ట్రం ప్రధాన రాజకీయ పార్టీలు-అవకాశవాదం

మన రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్షంగా ఉన్న టిడిపి, జనసేన పార్టీలు మోడీ ప్రభుత్వ విధానాల పట్ల పూర్తి అవకాశవాద వైఖరిని అవలంబిస్తున్నాయి. గత నాలుగేళ్లలో రాష్ట్రానికి జరుగుతున్న ఏ అన్యాయం పైనా ఈ మూడు పార్టీలూ నోరెత్తి మాట్లాడలేదు. విభజన చట్టం హామీల అమలు, ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ తదితర అంశాలపై మోడీ ప్రభుత్వంతో రాజీపడిపోయాయి. ఇప్పుడు ఎన్నికల తరుణంలో బిజెపితో టిడిపి, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి సీట్ల పంపిణీ చేసుకున్న నేపథ్యంలో ఈ పార్టీలు పౌరసత్వ చట్టం గురించి మాట్లాడతాయని భావించడం అత్యాశ అవుతుంది. రాష్ట్రంలోని కర్నూలు, అనంతపురం, గుంటూరు తదితర జిల్లాల్లో ముస్లిం ఓటర్లు పెద్ద సంఖ్యలో ఫలితాలను ప్రభావితం చేసే శక్తిగా ఉన్నారు. వారందరూ ఈ రెండు పార్టీల అవకాశవాద ధోరణిని గమనిస్తున్నారు. జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం పౌరసత్వ చట్టంపై తమ పార్టీ వైఖరిని వెల్లడించాలి. మైనార్టీల హక్కులు, రక్షణ తదితర అంశాలపై తన వైఖరి స్పష్టం చేయాల్సిన బాధ్యత జగన్‌పై ఉంది.

### రాజ్యాంగ ఆశయాల పరిరక్షణ

రాజ్యాంగ ఆశయాలైన సమాఖ్య విధానం, లౌకిక విధానం, ప్రజాస్వామ్యం పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పౌరసత్వ సవరణ చట్టం-2019 రాజ్యాంగ ఆశయాలకు, లౌకిక వాదానికి పూర్తి విరుద్ధం. దీనిని అమలు చేయకుండా ఉద్యమించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

(రచయిత శాసన మండలి సభ్యులు)




# వారు క్రైస్తవులనూ వదల్లేదు



పినరయి విజయన్

సంఘ్ పరివార్ క్రైస్తవులపై ఎంత దుర్మార్గంగా వ్యవహరించిందీ మణిపూర్‌లో చూశాం. క్రైస్తవ సమాజంపై ముఠా దాడులు నేడు దేశంలో నిత్యకృత్యంగా మారాయి. యునైటెడ్ క్రిస్టియన్ ఫోరమ్ (యుసిఎఫ్) ఈ ఏడాది సెప్టెంబరులో విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 2023 మొదటి ఎనిమిది నెలల్లోనే భారతదేశంలో క్రైస్తవులపై 525 దాడులు జరిగాయి. 2022లో, అంతకుముందు 2021లో జరిగిన దాడుల సంఖ్యను అధిగమించింది. 2012-2022 మధ్య హింసాత్మక చర్యల సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. 2016లో 247 హింసాత్మక ఘటనలు, 2021లో 505కు, 2022లో 599కి పెరిగాయి.

యుసిఎఫ్ విడుదల చేసిన డేటాలో మణిపూర్ చేర్చబడలేదు. మణిపూర్‌ను కలుపుకుంటే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. మణిపూర్ అల్లర్ల సమయంలో, ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల సంస్థల సాయుధ సమూహాలైన అరంబై తెంగోల్, మీతీ లీపున్ క్రూరమైన క్రైస్తవ వేటను నిర్వహించాయి. గిరిజన కుకీల ఆలయాలు నిరంతరం ధ్వంసమయ్యాయి. మణిపూర్‌లో సంఘ్ పరివార్ హిందూ జాతీయవాదానికి మరో రూపం కనిపించింది.

మణిపూర్‌లో వందలాది మసీదులను ధ్వంసం చేశారు. సుప్రీంకోర్టుకు సమర్పించిన పిటిషన్ ప్రకారం.. ధ్వంసమైన ప్రార్థనా స్థలాల సంఖ్య 642. జూన్‌లో కేవలం 36 గంటల్లో 249 చర్చిలు ధ్వంసమయ్యాయని ఇంఫాల్ ఆర్చ్ బిషప్ చెప్పారు. అధికారిక లెక్కల ప్రకారం.. 180 మందికి పైగా మరణించారు, 300 మందికి పైగా గాయపడ్డారు. దాదాపు 55 వేల మంది ప్రజలు తమ ఇళ్లను విడిచిపెట్టాల్సి వచ్చింది. ఈ భయంకరమైన మారణకాండలో బిజెపి ప్రభుత్వ నిష్క్రియాపరత్వాన్ని బయటపెట్టినందుకు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాపై ఆ రాష్ట్ర ప్రభత్వం తప్పుడు కేసులు పెట్టింది.

### 2014 నుంచి పెరిగిన దాడులు

2014 నుండి క్రైస్తవ వ్యతిరేక ద్వేషపూరిత నేరాలు గణనీయంగా పెరిగాయని ఎవాంజెలికల్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాలు తెలియజేస్తున్నాయి. అదే విధంగా, కాథలిక్ సెక్యులర్ ఫోరమ్ (సిఎస్‌ఎఫ్) విడుదల చేసిన ఇదే విధమైన నివేదిక ప్రకారం.. 2015లో, భారతదేశంలో మత ప్రచార సమయంలో కమ్యూనిటీ సభ్యులపై 365 తీవ్రమైన దాడులు జరిగాయి. ఒక్కదేశ రాజధానిలోనే అనేక హింసాత్మక సంఘటనలు నమోదయ్యాయి. 2015లో ఢిల్లీలోని ఆరు మసీదులు, క్రిస్టియన్ స్కూల్‌పై దాడి జరిగింది.

1990లో భారతదేశంలో క్రైస్తవ సమాజంపై దాడులు పెరిగాయి. అదే కాలంలో భారత రాజకీయాల్లో సంఘ్ పరివార్ అపూర్వమైన శక్తిగా ఎదిగింది. భారతదేశాన్ని మతపరంగా విభజించి హిందూ మెజారిటీ దేశంగా ఉంచే విధానాన్ని మరింత క్రూరంగా అమలు చేయడం ప్రారంభించిన దశ ఇది. అప్పుడప్పుడు మూక దాడులతో పాటు, క్రైస్తవులకు వ్యతిరేకంగా పెద్దయెత్తున అల్లర్లు జరిగాయి.




వారిలో, 1999లో ఒడిశాలో ఆస్ట్రేలియన్ మిషనరీ అయిన గ్రాహం స్టెయిన్స్, ఆయన ఇద్దరు ఇద్దరు కుమారులపై ఎన్నటికీ మరచిపోలేని క్రూరత్వం జరిగింది. అతని వాహనంలో నిద్రిస్తున్నప్పుడు, ఆ వాహనానికి గ్రాహమ్ స్టెయిన్స్, వారి పిల్లలను బజరంగ్‌దళ్‌తో సంబంధం ఉన్న మూక నిప్పంటించింది.

35 ఏళ్లుగా తన దేశం కంటే భారతదేశాన్ని ఎక్కువగా ప్రేమిస్తూ, ఒడిశాలోని పేద కుష్టురోగులకు తన జీవితాన్ని అంకితం చేసిన స్టెయిన్స్‌ను బజరంగ్‌దళ్ ముఠా గిరిజన సమూహాలలో క్రైస్తవ మతాన్ని వ్యాప్తి చేశారనే ఆరోపణపై చంపించింది. హత్యపై దర్యాప్తు చేసేందుకు నియమించిన జస్టిస్ వాధ్వా కమిషన్, స్టెయిన్స్ ఎలాంటి మతమార్పిడి ప్రక్రియలో పాల్గొనలేదని గుర్తించింది.

2008లో ఒడిశాలోని కందమాల్‌లో క్రైస్తవ వర్గానికి వ్యతిరేకంగా సంఘ్‌పరివార్ అల్లర్లు చెలరేగాయి. అనేక క్రైస్తవ సంస్థలు, గృహాలకు నిప్పు పెట్టారు. 60 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. 395 మసీదులు, 5,600కు పైగా ఇళ్లు దగ్ధమయ్యాయి. 600కు పైగా గ్రామాలను దోచుకున్నారు. అధికారిక లెక్కల ప్రకారం.. 39 మరణాలు నమోదయ్యాయి. తర్వాత కొన్ని అధ్యయనాలు మరణించిన వారి సంఖ్య 500 కంటే ఎక్కువ అని పేర్కొంది.

సన్యాసినులు సామూహిక అత్యాచారానికి గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. వీధిలో సన్యాసినిపై మూకుమ్మడి దాడి చేయగా, ఘటనా స్థలంలో ఉదాసీనంగా నిలబడిన పోలీసుల తీరు చూసి దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ సమయంలో, సన్యాసినులు, పూజారులు కంధమాల్‌లోని కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాల్లో ఆశ్రయం పొందారు.

సెప్టెంబరు 14, 2008న, మంగళూరు, ఉడిపి, చిక్కమగళూరుతో సహా కర్ణాటకలోని వివిధ జిల్లాల్లో దాదాపు 20 మసీదులను ధ్వంసం చేశారు. అదే దాడిని అనుసరించి, తమిళనాడులో చర్చిలపై దాడి జరిగింది. కృష్ణగిరిలో మేరీ మాత విగ్రహం దొంగిలించబడింది. మధురైలో ఏసు విగ్రహాన్ని ధ్వంసం చేశారు.

### మోడీ ప్రభుత్వ హయాంలో తీవ్రమైన హింస

కేంద్రంలో నరేంద్ర మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ధోరణి మరింత బలపడి దేశంలో క్రైస్తవ మత విశ్వాసులు, ప్రార్థనా స్థలాలపై విస్తృతంగా దాడులు జరిగాయి. యుపి, మధ్యప్రదేశ్, కర్ణాటక, హర్యానా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఎక్కువగా దాడులు జరిగాయి. చర్చిలకు నిప్పుపెట్టడం, క్రైస్తవులను బలవంతంగా హిందూ మతంలోకి మార్చడం మొదలుకుని హింసాకాండ సాగింది.

### నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో క్రైస్తవులపై దాడులకు సంబంధించిన డేటాను సేకరించదు. ఎన్‌సిఆర్‌బి డేటా ఇప్పుడు భారతదేశం అల్లర్లు తగ్గుముఖం పట్టిందని, ఇటీవలి సంవత్సరాల్లో మరింత శాంతియుత పరిస్థితిని చూసింది అనే అబద్ధాన్ని చూపుతోంది.

ఉత్తరప్రదేశ్‌లో హింసాత్మక సంఘటనల సంఖ్య బాగా పెరిగింది. 2014లో 18 నుండి 2017లో 50కు పెరిగింది. హర్యానా, ఛత్తీస్‌గఢ్‌లో దాడులు పెద్దయెత్తున పెరిగాయి. తరచూ, వ్యంగ్యం ఏమిటంటే, నేరస్తులు హుక్ నుండి బయటపడతారు. బాధితులపైనే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తారు.

2021లోనే క్రైస్తవులపై 505 దాడులు జరగ్గా.. వీటిలో ఎక్కువ శాతం కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల నుంచి నమోదయ్యాయి. అక్టోబరు 3, 2021న, ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో, చట్టవిరుద్ధమైన మతమార్పిడి కోసం చర్చిలో ప్రార్థన చేయడానికి వచ్చిన దాదాపు 250 మంది వ్యక్తుల గుంపు ద్వారా పెంటెకోస్టల్ మత ప్రచారకులు ప్రియో సాధనా పాటర్, ఆమె సహచరులను కొట్టారు. ప్రార్థనా మందిరాన్ని ధ్వంసం చేశారు.

అక్టోబరు 10, 2021న ఉత్తరప్రదేశ్‌లోని మౌ జిల్లాలో హిందూ వాహిని, బజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రార్థనలు చేస్తుండగా దాడి చేశారు. అయితే మత మార్పిడికి పాల్పడినందుకు పాస్టర్‌తో పాటు ఇతరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మతాల దాడులను నివారించడానికి ప్రార్థన సమావేశాలకు దూరంగా ఉండాలని కర్ణాటక పోలీసులు క్రైస్తవులకు సూచించారు. నవంబరు 21, 2021న, బెలగావిలోని క్రైస్తవ సంఘ సభ్యులకు పోలీసులు హెచ్చరిక జారీ చేశారు.

డిసెంబరు 6, 2021న, దాదాపు 300 మంది గుంపు మధ్యప్రదేశ్‌లోని విదిషా జిల్లాలో హిందూ విద్యార్థులను క్రైస్తవులుగా మారుస్తున్నారని ఆరోపించిన వీడియో యూట్యూబ్‌లో వైరల్ కావడంతో ఒక క్యాథలిక్ పాఠశాలను ధ్వంసం చేశారు.

డిసెంబరు 12, 2021న, కర్ణాటకలోని కోలార్ జిల్లాలో హిందూత్వ గ్రూపుల కార్యకర్తల నేతృత్వంలో క్రైస్తవ మత పుస్తకాలకు నిప్పుపెట్టి ధ్వంసం చేశారు. ఎన్‌డిటివి నివేదిక ప్రకారం.. 2021లో కర్ణాటకలో మతపరమైన మైనారిటీలపై ఇది 38వ దాడి. ఉత్తరప్రదేశ్, హర్యానా, అస్సాం సహా ఏడు రాష్ట్రాల్లో క్రిస్మస్ వేడుకలపై హిందూత్వ గ్రూపులు దాడి చేశాయి.

### దాడి చేసిన వారి పట్ల కాంగ్రెస్ మెతక వైఖరి

2023 జనవరిలో ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో ఒక చర్చిపై హిందూత్వ సంస్థలు దాడి చేశాయి. మార్చిలో ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో సన్యాసినులపై దాడి జరిగింది. అక్కడ సన్యాసినులు హిందూ తీవ్రవాదుల నుండి తప్పించుకోవడానికి తమ చర్చి దుస్తులను కూడా తీసేయాల్సి వచ్చింది.

సన్యాసినులను మతం మార్చేందుకు అమ్మాయిలను తీసుకెళ్లారని హిందూత్వ ఉగ్రవాదులు వారిపై దాడి చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలకు వ్యతిరేకంగా హిందూ జాగరణ్ మంచ్ హింసాత్మకంగా బెదిరించింది. కానీ వామపక్ష సంస్థలు దానికి వ్యతిరేకంగా బలమైన రక్షణ కల్పించాలని ప్రయత్నించినప్పుడు, కాంగ్రెస్ మెతక వైఖరి అవలంభించింది. మతోన్మాదానికి కాంగ్రెస్ ఎప్పుడూ చల్లని వైఖరిని అవలంభిస్తోంది. సంఘ్ పరివార్ మతతత్వాన్ని వ్యతిరేకించడం అసాధ్యమే కాదు, దానితో శాంతిని నెలకొల్పడానికి, దానిని పెంచడానికి ఎల్లప్పుడూ ప్రయత్నించబడింది.

దీనికి తాజా ఉదాహరణ ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పరిణామాలు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయానికి క్రైస్తవ మైనార్టీలపై దాడుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిష్క్రియ వైఖరి కూడా ప్రధాన కారణమని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

### గిరిజనులను విభజిస్తుంది

ఆదివాసీల మధ్య సంఘ్‌పరివార్ చేస్తున్న ప్రచారం ఫలితంగా వారి మధ్య విపరీతమైన చీలిక ఏర్పడింది. గిరిజనుల్లో మైనారిటీ క్రిస్టియన్లకు రిజర్వేషన్లు తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇతర వర్గాలను ఆందోళనకు గురిచేసింది.

క్రైస్తవ సమాజం, అర్చక వర్గంపై విస్తృతంగా హింసాత్మకంగా మారినప్పటికీ, మతమార్పిడుల పొగతెరను సృష్టించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచింది. ఇవన్నీ క్రైస్తవ సమాజంలో తీవ్ర నిరసన, నిరాశను సృష్టించాయి. అది ఎన్నికల్లో బలంగా ప్రతిఫలించింది.

కేరళలోని సంఘ్ పరివార్ మాత్రం ఈ విషయాలను దాచిపెట్టి క్రైస్తవ వర్గాన్ని ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా బలమైన రక్షణను పెంచడానికి మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి దేశం మొత్తం ఐక్యంగా నిలబడాల్సిన సమయమిది.

## విభజన అనేది సంఘ్ పరివార్ డిఎన్‌ఎలోనే వుంది



బృందా కరత్

"విభజన అనేది సంఘ పరివార్ డిఎన్‌ఎలోనే వుంది. ఎన్‌ఆర్‌సి (జాతీయ పౌర పట్టిక), సిఎఎ (పౌరసత్వ సవరణ చట్టం)లు రెండూ భిన్నమైనవని, సిఎఎతో ఎన్‌ఆర్‌సికి ఎలాంటి సంబంధం లేదంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అర్థ రహితం".

"సంఘ్ పరివార్ డిఎన్‌ఎలోనే ఈ విభజన వుంది. విభజన లేకుండా వారు మనుగడ సాగించలేరు. మతం పేరుతో ప్రజలను చీల్చడం, విద్వేషాలను వ్యాప్తి చేయడమే వారి జీవిత లక్ష్యం. భారత ప్రజల మధ్య ఘర్షణలు సృష్టించడమే వారి జీవిత పరమావధి. సిఎఎను ఆమోదించిన ఐదేళ్ళ తర్వాత ఈ నిబంధనలను ఇప్పుడు తీసుకురావడంలోనే వారి దుర్బుద్ధి అర్థమవుతోంది. లోక్‌సభ ఎన్నికలు మరికొద్ది రోజుల్లో వున్నాయనగా ఈ నిబంధనలను ఎందుకు తీసుకువచ్చారు?" అని ఆమె ప్రశ్నించారు.

## రాజ్యాంగ మూలాలపై దాడి



యూసఫ్ తరిగామి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సిఎఎ నిబంధనలను నోటిఫై చేయడం ద్వారా 'దేశ రాజ్యాంగ మూలాలపై దాడి చేసింది. 'దేశ రాజ్యాంగానికి లౌకిక ప్రజాస్వామ్యం పునాది. దురదృష్టవశాత్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రభుత్వం గత పదేళ్లుగా రాజ్యాంగ లౌకిక స్వరూపాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి దిగుతోంది. జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా విషయంలో కూడా అదే జరిగింది. ప్రస్తుతం అమల్లోకి తీసుకొచ్చిన సిఎఎ ద్వారా మైనార్టీలను లక్ష్యంగా చేసుకుంది. ఈ చట్టం తమకు ఆమోదయోగ్యం కాదని సిపిఎం ఇప్పటికే స్పష్టం చేసింది..




## నిబంధనలు ఏం చెబుతున్నాయి?

**బిల్లును ఆమోదించిన నాలుగు సంవత్సరాల తరువాత లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్రం సిఎఎ రూల్స్‌ను నోటిఫై చేసింది**

### 39 పేజీల నోటిఫికేషన్
### సిటిజన్‌షిప్ (అమెండ్‌మెంట్) రూల్స్ 2024

**ప్రతి దరఖాస్తుదారుడు తప్పనిసరిగా సమర్పించాల్సిన డాక్యుమెంట్లు**

- ఫారం 8ఎ. దీనితో పాటు దరఖాస్తుదారుని వ్యక్తిత్వం (క్యారెక్టర్)ను నిర్ధారిస్తూ అఫిడవిట్‌లు, ధృవీకరణలు
- రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో పేర్కొన్న భాషల్లో ఒకదానిలోనైనా సరిపడినంత ప్రావీణ్యం ఉన్నట్లు డిక్లరేషన్
- దరఖాస్తుదారుని వంశంలో ఒకరికైనా ఆ మూడు దేశాల్లో ఏదో ఒక దేశ పౌరుడని నిరూపించే డాక్యుమెంట్లు. పాస్‌పోర్టు, ఇతర గుర్తింపు కార్డుల్లాంటివి!

**దరఖాస్తుదారుడు వీటిని నిరూపించాల్సిందే**

1. డిసెంబర్ 31, 2014 కు ముందే భారతదేశంలోకి ప్రవేశం.
2. దరఖాస్తుదారుడు లేదా అతని తల్లితండ్రుల్లో ఎవరో ఒకరు స్వంత్రత భారత పౌరులన్న విషయం

**సిఎఎ ఏం చెబుతోంది?** ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల నుండి భారతదేశంలోకి ప్రవేశించిన హిందూ, సిక్కు, జైన్, బుద్ధ, క్రిస్టియన్, పార్సీ మతాలకు చెందిన వారిని పౌరసత్వానికి అర్హులని పేర్కొంది. ముస్లింలను విస్మరించింది. పౌరసత్వానికి మతాన్ని ప్రాతిపదిక చేయడం ఇదే మొదటిసారి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68